RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 294 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 నవంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## మణిపూర్‌కు అదనపు బలగాలు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం అక్కడకు అదనపు బలగాలను తరలించింది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 2000 మంది సైనికులను ఆ రాష్ట్రానికి పంపిస్తూ కేంద్ర హెూంవ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లాలో సోమవారం భద్రతాదళాలు, కుకీ మిలిటెంట్ల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 11 మంది కుకీ మిలిటెంట్ల హతమైన సంగతి తెలిసిందే. మరోవైపు ఆదివారం జిరిబామ్ జిల్లాలోని మైతేయి గ్రామాలపై కుకీ ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. థమ్నాపోక్పీ, సబున్‌కోక్, సనసాబి గ్రామాలకు సమీపంలోని కొండలపై నుంచి తుపాకుల కాల్పులు, బాంబులతో దాడులకు పాల్పడ్డారు.

# విద్యార్థుల కలలను నిజం చేస్తాం

## రూ.5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం




హైదరాబాద్: విద్యార్థుల కలలను నిజం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. "రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు..

దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత. నవీన భారత రూపశిల్పి నెహ్రూ. రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించాం" అని సీఎం తెలిపారు.

**పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు :** "ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం.

**నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం :** అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి.

హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలి. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం. గత సీఎంను ఏనాడైనా మీరు (విద్యార్థులను ఉద్దేశించి) చూశారా? మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలి" అని సీఎం కోరారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు...

## తాజాగా మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు..!

సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి నల్లగొండలో ప్రకంపనలను సృష్టిస్తోంది. ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు కేవలం పోలీసు అధికారులే జైలుకు వెళ్లగా.. ఇప్పుడు నేతల వంతు వచ్చిందన్న టాక్ వినిపిస్తోంది. పోలీసులపై ఫోకస్ చేసిన స్పెషల్ టీం.. ఇపుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలపై ఫోకస్ పెట్టిందట. ఇప్పటికే బీఆర్ఎస్ నేత చిరుమర్తి లింగయ్యకు నోటీసులు అందుకోగా, మరికొందరు గులాబీ నేతలకు నోటీసులు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.పోలీసుల నెక్స్ట్ టార్గెట్ వీళ్లేనా..? పోలీసుల నోటీసులతో జిల్లాలోని మాజీలకు భయం పట్టుకుందా..? అన్న చర్చ మొదలైంది.

**అధికారులంతా నల్లగొండ జిల్లాలో పని చేసిన వారే..!** రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల సమయంలో జిల్లాకు చెందిన నేతల కదలికలను పసిగట్టేందుకు నల్లగొండలోనే వార్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నలుగురు అధికారులు గతంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పనిచేసిన వారే. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు 2015లో నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు నల్లగొండలో ఓఎస్డి గా పని చేశారు. ఏఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులు కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. డిఎస్పి ప్రణీత్ రావు.. ఎస్సైగా జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. సీఐ గట్టు మల్లు కూడా నల్గొండ జిల్లాలో పనిచేశారు.

**జిల్లా బీఆర్ఎస్ నేతలపై ఫోకస్..!** తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ టీం.. పొలిటికల్ లీడర్లపై దృష్టి సారించిందట. ముఖ్యంగా ఈ కేసులో నిందితులుగా ఉన్న పోలీస్ అధికారులు గతంలోబడి నల్గొండ జిల్లాలో పనిచేశారు. ఆ సమయంలోనే వీరితో సన్నిహిత్యం కలిగిన రాజకీయ నేతలపై స్పెషల్ టీం ఫోకస్ పెట్టిందట. ఫోన్ ట్యాపింగ్ కేసులో చాలామంది లీడర్లకు సంబంధాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారట. ఈ కేసులో నిందితులైన ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న స్టేట్మెంట్ల ఆధారంగా పోలీసులకు పలు విషయాలు తెలిశాయి.

మునుగోడు ఉప ఎన్నిక, గత సాధారణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేసి సమాచారం సేకరించారని, దాన్ని అప్పటి అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వాడుకున్నారట. ఇందుకోసం నల్లగొండ జిల్లా కేంద్రంలో వార్ రూమ్ ను కూడా ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

**మరికొందరు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు..?** ఏఎస్పీ తిరుపతన్నతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొందరు నేతలకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో లింక్స్ ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈనెల 11వ తేదీన విచారణ హాజరు కావాలంటూ ఎనిమిదో తేదీన నక్రేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు ఇచ్చారు. అనారోగ్య కారణాలతో నవంబర్ 14వ ఇవాళ హాజరవుతానంటూ చిరుమర్తి లింగయ్య చెప్పారు. ఈ నేపథ్యంలో ఇవాళ(నవంబర్ 14) విచారణను




ఎదుర్కొంటానని, పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతానని లింగయ్య తెలిపారు. తనపై రాజకీయ కుట్రతోనే నోటీసులు ఇచ్చారన్న లింగయ్య, ఈ నోటీసులపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ పనితీరును ఎండ గడున్నందుకే విమర్శిస్తున్నందుకే.. ప్రభుత్వం ఈ కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పోలీస్ అధికారులు పోస్టింగ్ ల కోసం, కార్యకర్తల అవసరాల కోసం తాను మాట్లాడడం సహజమే అన్నారు. తాజాగా మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బోల్లం మల్లయ్య యాదవ్, పైళ్ల శేఖర్ రెడ్డిలకు స్పెషల్ టీం పోలీసులు నోటీసులు అందించారట మరికొందరు నేతలకు కూడా నోటీసులు వస్తాయని పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా చర్చ జరుగుతోంది. దీంతో గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ముఖ్య నేతలపై పోలీసులు దృష్టి సారించారట. కొద్ది రోజుల్లోనే వారికి కూడా నోటీసులు పంపాలని యోచనలో పోలీసులు ఉన్నారట. ఎప్పుడు ఎవరికీ నోటీసులు వస్తాయోనని మాజీలు ఆందోళన చెందుతున్నారట. మొత్తానికి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయ నేతలకు తాకడంతో కలకలం రేపుతోంది. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తో పాటు.. మరో ఇద్దరు మాజీలకు కూడా పోలీసులు నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

## మిడి మిడి జ్ఞానంతో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడి మిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని... గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుందని ఈ క్రమంలో కొంత జాప్యం జరిగితే తొందరపాటుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, అంతమాత్రాన బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే చెప్పడం అవివేకమని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అవినీతి ఎక్కడ జరిగినా విచారణ జరపాలన్నది తమ డిమాండ్ అని అన్నారు. కాళేశ్వరం మీద సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని, సీఎం రేవంత్ రెడ్డి విచారణ కోరారా.. అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి





వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. వైఫల్యాలను, అసమర్ధత నుంచి దృష్టి మళ్లించేందుకు రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని, కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు తమకు అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి ప్రాజెక్టులు ప్రారంభించడానికి వస్తే బయటకు రాని కేసీఆర్, కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. కలెక్టర్ మీద దాడి తప్పు అని.. కానీ గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టడం కూడా సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటన అని, ఆయన తన ప్రజలతో మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు.

మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని, ఒక్క అవినీతి, కుంభకోణం ఆరోపణ లేకుండా బీజేపీ, శివసేన ప్రభుత్వ పాలన సాగిందని కిషన్ రెడ్డి అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో బొగ్గు శాఖ, గనుల శాఖ విడివిడిగా పెవిలియన్లు ఏర్పాటు చేశామన్నారు. కోల్ ఇండియా ప్రపంచంలోనే 3వ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారని, ఇది ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు.

# ఉత్కంఠ భరితంగా....

# తెలంగాణ రాజకీయాలు




హైదరాబాద్ : తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఢిల్లీకి వెళ్లడం తెలంగాణ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. మరో 4 రోజుల పాటు ఆయన ఢిల్లీలోనే ఉండనున్నట్లు వార్తలు వస్తున్నాయి. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాతో గవర్నర్ భేటీ అయ్యే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. ఫార్ములా – ఈ రేసు వ్యవహారంలో కేటీఆర్ విచారణకు తెలంగాణ ఏసీబీ గవర్నర్ ను అనుమతి కోరింది. ఇందుకు సంబంధించి అమిత్ షాతో గవర్నర్ చర్చించనున్నట్లు ప్రచారం సాగుతోంది. అమిత్ షా ఆదేశాల ప్రకారమే గవర్నర్ నడుచుకుంటారన్న చర్చ సాగుతోంది. ఈ రోజు సాయంత్రం గవర్నర్ ఢిల్లీ నుంచి రానున్నారు. ఆయన ఢిల్లీ నుంచి వచ్చిన వెంటనే కేటీఆర్ విచారణపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో గవర్నర్ అమిత్ షా భేటీపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మొన్న కేటీఆర్ సైతం ఢిల్లీకి వెళ్లారు. అమృత్ స్కీమ్ పై ఫిర్యాదు చేసేందుకు వెళ్లానని ఆయన వెల్లడించారు. కానీ కేంద్ర పెద్దలను కలిసి కేసు నుంచి బయటపడేందుకే కేటీఆర్ ఢిల్లీ టూర్ అని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి ఇవ్వకుండా మరే నిర్ణయం తీసుకున్నా బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కే ఇందుకు కారణమన్న ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ సిద్ధం అవుతోంది. ఒక వేళ గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే వెంటనే కేటీఆర్ ను విచారించేందుకు తెలంగాణ ఏసీబీ సిద్ధం అవుతోంది. విచారణ అనంతరం ఆయనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో గవర్నర్ ఏ స్టెప్ తీసుకున్నా.. అది తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారే అవకాశం ఉంది.

# సంపాదకీయం

## బాబు నితీష్‌లను ముగ్గులోకి లాగుతున్నారా!?

మంచి మాటకారి తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఆయనలో లౌక్యం పాలు కూడా ఎక్కువే. రేవంత్ రెడ్డి రాజకీయం కూడా చాలా ఆసక్తిగా ఉంటుంది. ఆయన మొదట ఏబీవీపీలో ఉన్నారు. ఆ తరువాత టీడీపీ ఇపుడు కాంగ్రెస్. ఇలా సాగిన రాజకీయంలో తాను ఏమి నేర్చుకున్నానో మంచి విషయాలే ఆయన చెప్పడంలోనే ఆయన నాయకత్వ లక్షణాలు ఆయన సత్తా అందరికీ తెలుస్తోంది. ఇవన్నీ ఆయన ది ఇండియన్ ఎక్స్ ప్రెస్ ఇంటర్వ్యూలో ఇలాంటి ముచ్చట్లు ఎన్నో చెప్పారు. తాను ఏబీవీపీలో దేశం పట్ల నిబద్ధతను నేర్చుకున్నానని టీడీపీలో ఉన్నపుడు అభివృద్ధి సంక్షేమం గురించి నేర్చుకున్నా నని కాంగ్రెస్ లో సామాజిక న్యాయం గురించి నేర్చుకున్నానని రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక దేశానికి కాంగ్రెస్ ప్రధాన మంత్రి ఎపుడు వస్తారు తదుపరి ప్రధాని రావడానికి ఎంత కాలం పడుతుందని అడిగిన మరో ప్రశ్నకు రేవంత్ రెడ్డి చాలా చాకచక్యంగా జవాబు చెప్పడమే కాదు ఏకంగా ఏపీ సీఎం చంద్రబాబుని అలాగే బీహార్ సీఎం నితీష్ కుమార్ ని ముగ్గులోకి లాగారు. చంద్రబాబు నితీష్ కుమార్ లాంటి వారు ఉంటే ఏడాదిలోనే కాంగ్రెస్ నుంచి ప్రధాని వస్తారు అని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇపుడు సంచలనం రేపుతున్నాయి. ఈ ఇద్దరూ మద్దతు ఇస్తే కాంగ్రెస్ దే అధికారం అన్నట్లుగా రేవంత్ చేసిన కామెంట్స్ దేశ రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యాయి. నిజంగా కాంగ్రెస్ కి చంద్రబాబు నితీష్ కుమార్ మద్దతు ఇస్తారా అలా ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారా అన్న చర్చ సాగుతోంది. రేవంత్ రెడ్డి అన్నారని కాదు కానీ ఈ ఇద్దరే ఎన్డీయే కూటమికి ఊత కర్రలుగా ఉన్నారు. బీజేపీకి సొంతంగా బలం లేదు అధికారంలోకి రావడానికి. అలాగే అధికారం నుంచి దిగిపోవాలన్నా ఈ రెండు పార్టీలు నో సపోర్ట్ అన్న ఒక్క మాట అంటే చాలు. అంటే కేంద్రంలోని బీజేపీ భవిష్యత్తు అంతా ఈ ఇద్దరి మీదనే ఆధారపడి ఉంది అన్న మాట. ఈ విషయం అందరికీ తెలిసిందే. కానీ సందర్భోచితంగా రేవంత్ ఈ హాట్ కామెంట్స్ చేశారా లేక నిజంగా అలాంటి ఆశలు ఇండియా కూటమిలో ఇప్పటికీ ఆరకుండా ఉన్నాయా అన్న డిస్కషన్ సాగుతోంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చి గట్టిగా ఆరు నెలలు కాలేదు. ఏడాది లోగా కాంగ్రెస్ ప్రధాని అని రేవంత్ రెడ్డి అంటున్నారు అంటే మరో ఆరు నెలల వ్యవధిలో కేంద్రంలో పరిణామాలు ఏమైనా మారుతాయా అన్న చర్చ కూడా సాగుతోంది. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి బాబు నితీష్ లను ముగ్గులోకి లాగేశారు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# నిబంధనలను అనుసరిస్తూ వాహనాలు నడిపితేనే రోడ్డు ప్రమాదాలను అరికట్టగలం : శామీర్పేట సీఐ శ్రీనాథ్





శామిర్ పేట, (గరుడ వార్త) : రోడ్డు ప్రమాదాలకు తావివ్వకుండా ఉండాలంటే, ప్రతి ఒక్కరు తప్పక నిబంధన అనుసరిస్తూ వాహనాలు నడపాలంటూ శామీర్పేట సిఐ శ్రీనాథ్ వాహనదారులకు సూచించారు. గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్సార్ చౌరస్తా, అలియాబాద్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం వాహనాలను నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడప రాదని సూచించారు. మద్యం సేవించి, సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఈ తనిఖీలలో మొత్తం 56 ఆటోలు తనిఖీ చేశామని, సరియైన పత్రాలు లేని 5 వాహనాలతో పాటు మొత్తం 13 వాహనాలకు చలాన విధించామని తెలిపారు. అనంతరం వాహనాల నిబంధనలపై యజమానులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు హారిక, దశరథ, ఏ ఎస్ ఐ , సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా బాలల దినోత్సవం వేడుకలు





శామీర్ పేట, (గరుడ వార్త) పూర్వ ఉమ్మడి శామీర్ పేట పేట మండలంలో కన్నుల పండుగగా బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సీనియర్ ఉద్యమ కారుడు, కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అఫ్జల్ ఖాన్ ఆధ్వర్యంలో తుర్కపల్లి లో ని సేవ్ ఆల్ రీచ్ ఆల్ అనాధ ఆశ్రమంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అఫ్జల్ ఖాన్ బాలలకు, వృద్ధులకు పండ్లు, చాక్లేట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు దేశ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కు పిల్లలు అన్న , పూవులు అన్న ఎంతో ప్రీతి అని, ఇందులో భాగంగానే నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నారని చెప్పారు. చిన్నారుల భవిష్యత్తు తీర్చి దిద్దే విదంగా తల్లిదండ్రులు, గురువులు బాధ్యతలు తీసుకోవాలని అఫ్జల్ ఖాన్ పిలుపునిచ్చారు. సేవ్ ఆల్ రీచ్ ఆల్ అనాధ ఆశ్రమానికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని, అదే విధంగా గుండెను దీటుగా చేసి ఆశ్రమం నడుపుతున్న ఫౌండర్ సువార్తమ్మ కు అఫ్జల్ ఖాన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వంగ వెంకట్ రెడ్డి, పి నర్సింహా రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవర యంజాల్లో....భారత దేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ 135 వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళ్యాణి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కట్ట మీనా, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నరసింహారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ కార్యదర్శి గంధం ప్రవీణ్ కుమార్ గౌడ్, మహమ్మద్ అబ్బులు విద్యార్థులకు బిస్కెట్ చాక్లెట్లు పంపిణీ చేశారు.

తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో....బాలల దినోత్సవం సందర్భంగా తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు బయాలజికల్ ఈ, దాట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాయ్ ఆఫ్ గివింగ్ అనే ప్రోగ్రాం కింద విద్యార్థులకు షటిల్ బ్యాట్స్, క్రికెట్ బ్యాట్స్ , డిక్షనరీస్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, 10వ తరగతి ఆల్ ఇన్ వన్ వంటి వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు వసంత కుమారి ఫౌండేషన్ సభ్యులను, కోఆర్డినేటర దేవా , దాట్ల ఫౌండేషన్ వాలంటీర్స్ సౌమ్య, వైష్ణవిలను ప్రత్యేకంగా అభినందించారు. మునుముందు ఇలాగే దాట్ల ఫౌండేషన్ సహకారం విద్యార్థులపై ఉండాలని ప్రధానోపాధ్యయురాలు వసంతకుమారి కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిరుమలేష్, అన్నపూర్ణ, నాగ శారద, వనజ, శ్రీనివాస్ రెడ్డి, రజిని, వరలక్ష్మి, భాగ్యరేఖ, మహేష్, శ్రీదేవి, మంజుల, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుకు చేయూతనివ్వగలిగితేనే దేశాభివృద్ధి: ఎంపీ ఈటెల

### అఖిల భారత సహకార వారోత్సవాలను ప్రారంభించిన ఎంపి ఈటల





శామీర్ పేట, (గరుడ వార్త) : రైతుకు చేయూతనివ్వగలిగితేనే దేశాభివృద్ధి జరుగుతుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రం శామీర్ పేట రైతుసేవ సహకార సంఘంలో 14 నుంచి 20 వరకు జరిగే 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల మాట్లాడుతూ ప్రతి మనిషికి పట్టెడు అన్నం పెట్టిననాడే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. రైతులు దేశానికి వెన్నుముక లాంటివారని తెలిపారు. నిరుపేద దేశంగా ఉన్న భారత్ ఎదగాలంటే అన్ని వర్గాలు కలసి కట్టుగా పనిచేస్తు రైతులకు చేయూతనివ్వాలని చెప్పారు. కార్పోరేట్ మోజులో ప్రైవేటు రంగాలు దూకుడుతో ప్రస్తుత భారత దేశంలో గొప్ప వారుమరింత గొప్పగా, పేదలు మరింత పేదరికంలో జీవిస్తున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. కార్పోరేట్ వెంట పరుగెత్తుతే అభివృద్ధికి బాటలు పడవన్నారు. దేశంలో సాఫ్ట్ వేర్, హార్డువేర్ లతో వచ్చిన కోట్ల మంది యువతను ఆదుకొని పరిస్థితి లేదని, కార్పోరేట్ సెక్టార్ వల్ల ఉపాధిని కోల్పోవల్సిన పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశం 5వ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే కేవలం టెక్నాలజీ, కార్పోరేట్ అంటె సరిపోదని, లాభనష్టాలను చూడకుండ పనిచేసే వ్యవసాయ రంగంలో రైతాంగానికి పెద్ద పీట వేయాల్సిన అవసరం ఎంతైన ఉందని తెలిపారు. ఈ రోజు దేశంలో ఎవరికి దక్కనంత గౌరవం కేవలం రక్తాన్ని చమటగా మర్చిన రైతన్నకు మొదటి ప్రాధాన్యత లభిస్తే దేశానికి సేలందిస్తున్న జవాన్ కు గౌరవం లభిస్తోందని ఆయన తెలిపారు. పొద్దున లేచిన దగ్గర నుంచి ఆవులకు పాలు మనుషులే పిండాలని, పొలానికి మనమే వెళ్ళాలని, మార్కెట్ వంటి తదితర అంశాలలో మనుషులకు వ్యవసాయ రంగంలోనే ఎక్కువ అవసరం ఉంటుందన్నారు. మానవ సమాజం ఉన్నంత వరకు ఉపాధికి ఎలాంటి లోటు ఉండదనే విషయాన్ని యువత మర్చిపోవద్దని చెప్పారు. వ్యవసాయదారుల సహకార సంఘాలు రైతులను ప్రోత్సహించాలని, నూతన వంగడాలు, మార్కెటింగ్ వంటి అంశాలు, కొత్త పెట్టుబడులతో ఆర్థిక పరిపుష్టిని సాధించాలని ఆయన రైతులకు చెప్పారు. రైతుల సంక్షేమానికి కావల్సిన సదుపాయాలను కేం ద్ర ప్రభుత్వం నుంచి కల్పించేందుకు తాను కృషి చేస్తానని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సహకార సంఘం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, శామీర్ పేట రైతు సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి ఛైర్మన్ నర్సింలుయాదవ్, సహకార సంఘం వైస్ ఛైర్మన్ ఐలయ్య యాదవ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సుదర్శన్, సహకార సంఘం డైరక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# నిధులు వాగుల పాలు

వేములవాడ: వాగులపై పైవంతెనలు లేక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు తాత్కాలిక రహదారులు కొట్టుకుపోతున్నాయి. ఫలితంగా రూ.లక్షల నిధులు వాగుల్లో కలుస్తున్నాయి. ప్రతి సంవత్సరం ప్రజాధనం వృథా అవుతున్నా పైవంతెనల నిర్మాణం చేపట్టక రవాణా కష్టాలు తీరడం లేదు.

వాగులు, ఒర్రెల వద్ద పైవంతెనలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ నిధులు మంజూరు కాక లక్షలాది రూపాయలు వెచ్చించి మొరం, మట్టితో తాత్కాలిక రోడ్లు వేస్తున్నారు. ఇందుకు కిలో మీటరు పొడవు తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణానికి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు మొరం మందాన్ని బట్టి ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చి కొట్టుకుపోయి నిధులు నీటి పాలవుతున్నాయి. అయినా నేతలు, అధికారులు పైవంతెనల నిర్మాణం చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్లు మొత్తం కొట్టుకుపోయి ప్రజల రవాణాకు ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల పైవంతెనల నిర్మాణ పనులు చేపట్టినా అవి పూర్తికాలేదు. వాటి దగ్గర వేసిన తాత్కాలిక రోడ్లు సైతం వరదకు నామరూపాల్లేకుండా పోయాయి.

వేములవాడ గ్రామీణ మండలంలోని హన్మాజీపేట నక్కవాగు వద్ద వంతెన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కాక పక్కనే వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఇటువైపు వెళ్లే బొల్లారం, లింగంపల్లి, మామిడిపల్లి తదితర గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

వేములవాడ నుంచి బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి వైపు రోడ్డులో వంతెన పనులు చేపట్టినప్పటికీ అది పూర్తి కాలేదు. ఇక్కడ కూడా రోడ్డు వరదకు ఆనవాళ్లు లేకుండా పోయింది.

కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి– నిజామాబాద్ గ్రామాల మధ్య, ఇదే విధంగా బావుసాయిపేట– వెంకట్రావ్‌పేట మధ్య మూలవాగు ఉద్ధృతంగా పారడంతో తుడిచిపెట్టుకుపోయాయి. వట్టిమల్ల–నిమ్మపల్లి గ్రామాల మధ్య కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

చందుర్తి మండలంలోని మర్రిగడ్డ– సనుగుల, కోనరావుపేట మండలంలోని కొండాపూర్, జవహరిపేట– నర్సక్కపేట, రుద్రంగి మండలంలోని మానాల ప్రాంతాల్లోనూ రోడ్లు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి.

వేములవాడ పట్టణంలోని బతుకమ్మ తెప్ప నుంచి తిప్పాపూర్ మధ్య మూలవాగులో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి సందర్భంగా ఈ ఏడాది దాదాపు రూ.5 లక్షల వెచ్చించి నిర్మించిన మట్టి రోడ్డు వరదలో కలిసిపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగులపై పైవంతెనల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు చర్యలుఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. వర్షాలు తగ్గిన తరవాత అంచనాలు సిద్ధం చేసి పనులు చేపడతాం.

శాంతయ్య, డీఈ, ఆర్అండ్‌బీ

# హద్దులు తేలక.. హక్కులు తెలియక

సిరిసిల్ల : ప్రభుత్వ, ప్రైవేటు భూముల పహాణీలు, 1బి దస్త్రాలన్నీ వారి చేతుల్లోనే ఉన్నాయి. ఏం చేయాలనుకున్నా చేసే అధికారమూ ఉంటుంది. ఇదే అదనుగా ఓ రెవెన్యూ ఉద్యోగి హద్దుల్లేని ప్రభుత్వ భూమిలో పట్టా పొందాడు. రైతుబంధు జమవుతుండటంతో రెండేళ్ల క్రితం గ్రామస్థులు గుర్తించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుబంధును నిలిపివేయించారు. రెండ్రోజుల క్రితం అదే భూమికి హక్కుదారులమంటూ మరికొందరొచ్చారు. పశువుల మేత కోసం వదిలిన గుట్టప్రాంతాన్ని చదును చేయడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. హద్దుల్లేని రెవెన్యూ, అటవీ భూమిలో హక్కులు కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలోని కోనరావుపేట మండలంలో గతంలో పని చేసిన ఓ రెవెన్యూ ఉద్యోగి శివంగళపల్లి అడవి సరిహద్దులోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని దస్త్రాల్లో తన పేరున మార్చుకున్నాడు. గత ప్రభుత్వం 2018లో భూదస్త్రాల ప్రక్షాళన తర్వాత కొత్తగా ధరణిని తీసుకొచ్చింది. దీనిలోని రైతుల వివరాల ఆధారంగా రైతుబంధు అమలు చేసింది. ఇలానే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.40 వేలు చొప్పున జమయ్యాయి.

2021లో రైతుబంధు లబ్ధిదారుల జాబితాను గ్రామంలో ప్రదర్శించడ ంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో రైతుబంధును నిలిపివేశారు. భూమి పట్టా రద్దు కాలేదు.

ఇటీవల కొందరు గుట్టపై ఉన్న భారీ వృక్షాలను యంత్రాల సాయంతో నేలకూల్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అడ్డు చెప్పడంతో పాటు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పరిశీలించి అది అటవీశాఖ పరిధిలోనిది కాదని తేల్చారు. అయితే అనుమతి లేకుండా భారీ వృక్షాలను నరికినందుకు జరిమానా విధించారు.



చాలా ఏళ్ల క్రితం గ్రామంలోని నిరుపేదలకు అడవి సమీపంలోని ప్రభుత్వ భూమికి పట్టాలిచ్చారు. మిగిలిన భూమిని గ్రామంలో పశువుల మేతకు వదిలేశారు. ఇలా పట్టాలు చేయగా ఉన్న భూమిని దస్త్రాల్లోకి తన పేరున మార్చుకున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ధరణిలోనూ ఈ భూముల వివరాలేవీ చూపకపోవడంతో చేతులు మారినట్లు చెబుతున్నారు.

ఇలాంటివి ఎక్కడెక్కడ ఉన్నాయంటే...

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసాను ప్రకటించింది. గుట్ట ప్రాంతాన్ని సాగులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో రెవెన్యూ, అటవీ భూముల వివాదాలు కోనరావుపేట మండలం నిమ్మపల్లి, జైసేవాలాల్ఊరు తండా, వట్టిమల్లతోపాటు చందుర్తి, వీర్నపల్లి మండలాల్లోనూ ఉన్నాయి. కాగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, అటవీ భూములు ఉండటంతో గుర్తించడం కష్టంగా మారింది. అటవీశాఖ అధికారులు కంపార్టుమెంట్లు, కోఆర్డినేట్లు తీసుకుని కొలతలు వేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్వే సమయంలో రెండు శాఖల మధ్య తేడాలు వస్తున్నాయి. దీనికి తోడు దస్త్రాల నిర్వహణలోనూ లోపాలు ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

ప్రభుత్వ, అటవీ భూముల మధ్య హద్దులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శివంగళపల్లిలోని భూ వ్యవహారం జిల్లా అధికారుల దృష్టిలో ఉంది. దీనికి సంబంధించిన దస్త్రాలను అప్పగించాం. ఇప్పటికే రైతుబంధును నిలిపివేశారు. ఆ భూమిని గ్రామస్థులంతా గ్రామ అవసరాలకు ఉపయోగపడేలా ఉంచాలని కోరుతున్నారు.విజయప్రకాశ్, తహసీల్దార్

# కుళాయి కనెక్షన్లలో.. కానరాని పారదర్శకత!

చెన్నూరు : ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో నల్లా కనెక్షన్లను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు మూడేళ్ల నుంచి కసరత్తు చేస్తున్నారు. కొన్నిచోట్ల పూర్తయినా మరికొన్ని చోట్ల కాకపోవడంతో ఇప్పటికీ రసీదుల విధానం కొనసాగిస్తున్నారు. ఫలితంగా అక్రమాలకు తావిచ్చే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 3 లక్షలకు పైగా కనెక్షన్లు ఉండగా.. వాటన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇది పూర్తయితే ప్రతి ఆస్తిపన్నుతో పాటు నల్లా బిల్లులు అందులో కనిపించే అవకాశముంటుంది. తద్వారా అక్రమాలకు చెక్ పడనుంది. కొన్నిచోట్ల పలువురు నాయకులు, అధికారులు చెప్పగానే ఎక్కడ కుళాయి కనెక్షన్ కావాలంటే అక్కడ ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో బల్దియాల ఆదాయానికి గండి పడుతోంది. డిపాజిట్ల రూపంలో, నెలవారీ రుసుం చెల్లించకుండా జాప్యమవుతోంది.

**ఇంటి నంబరు నమోదు చేస్తే..**

గతంలో నల్లా కనెక్షన్ల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయకపోవడంతో సమస్యలు ఎదురయ్యేవి. కొంతమంది బిల్లులు చెల్లించినా డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో ఫిర్యాదులు వచ్చేవి. వీటన్నింటిపై దృష్టిసారించిన పురపాలకశాఖ అన్ని సంఘాల్లో ఆన్‌లైన్



విధానంలో నల్లా బిల్లులు, కొత్త కనెక్షన్ల జారీ ప్రక్రియ చేపడుతోంది. ఇంటి నంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఇంట్లో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయనేది తెలుస్తుంది. మరోవైపు గత ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు డిజిటల్ ఇంటి నంబర్లు ఏర్పాటు చేస్తే ఇంటిపన్నుతో పాటు విద్యుత్తు, నల్లా బిల్లులు అనుసంధానం కానున్నాయి.

**కొత్త పురపాలికల్లో పాత విధానమే**

పాత బల్దియాల్లో ఆన్‌లైన్ విధానంలో కుళాయిల మంజూరు బాగానే ఉన్నా.. కొత్తగా ఏర్పాటైన వాటిల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. మూడేళ్లలో కేవలం రెండంకెల సంఖ్య కూడా దాటకుండా ఆన్‌లైన్ ద్వారా కనెక్షన్లు ఇచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొత్త వాటిల్లో ఇప్పటికీ మాన్యువల్‌గానే కనెక్షన్లు ఇస్తున్నారు.

**రసీదులు ఎప్పుడైనా లభ్యం**

కొత్తగా నల్లా కనెక్షన్ తీసుకునే వారికి బిల్లులు చెల్లించేందుకు పుస్తకాలు ఇవ్వడం లేదు. నల్లా కనెక్షన్ నంబర్ లేదంటే ఇంటి నంబర్ నమోదు చేయడంతోనే కుళాయి కనెక్షన్ వివరాలు, బిల్లుల చెల్లింపు చూపిస్తోంది. వీటికి సంబంధించిన రసీదులు ఎప్పుడైనా తీసుకునే వీలుంది. పుర కార్యాలయానికి వచ్చి నల్లా బిల్లు చెల్లించాలనే నిబంధన ఏమీ లేదు. ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా చెల్లించవచ్చు.

**మార్గదర్శకాలు ఇస్తాం**

మురళీకృష్ణ, కమిషనర్, చెన్నూరు పురపాలిక

ఆస్తిపన్ను చెల్లింపు నుంచి నల్లా బిల్లుల వరకు సేవలన్నీ ఆన్‌లైన్ ద్వారానే చేపడుతున్నాం. కొత్తగా నల్లా కనెక్షన్ కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. మున్సిపాలిటీల్లో ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి.

# ధాన్యం రైతుల దైన్యం..!

పెనుబల్లి : ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా ధాన్యం క్రయవిక్రయాలు ఆశించిన స్థాయిలో జరగటం లేదు. ఈసారి సర్కారు, మిల్లర్ల మధ్య చర్చలు కొలిక్కిరాకపోవటంతో సమస్య ముదురుతోంది. ఈక్రమంలో అన్నదాతలు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పటంతో ఎక్కువ మంది అన్నదాతలు సన్నరకాలను సాగుచేసిన విషయం విదితమే.

**చర్చలు కొలిక్కి వచ్చేనా..?**

ఖమ్మం జిల్లాలో 64, భద్రాద్రి జిల్లాలో 42 మిల్లులకు ధాన్యం కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. సన్నాలు, దొడ్డురకాలు తేడా లేకుండా ప్రతి క్వింటా వడ్లకు 67 కిలోల బియ్యాన్ని మిల్లర్లు తిరిగి అప్పగించాలని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆదేశాలున్నాయి. సాధారణంగా క్వింటా దొడ్డు రకం వడ్లకు 67 కిలోల బియ్యాన్ని అప్పగిస్తుంటామని, 17 శాతం తేమతో సన్నరకం వడ్లను కేటాయిస్తే క్వింటాకు 58-60 కిలోల బియ్యం మాత్రమే వస్తుందని మిల్లర్లు చెబుతున్నారు. ఈవిషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరుతున్నారు. గతంలో కొందరు మిల్లర్లు సీఎంఆర్ అప్పగించకపోవటంతో ఈసారి బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని ప్రభుత్వం ఇటీవల సూచించింది. మిల్లింగ్ సామర్థ్యాన్ని బట్టి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కనిష్ఠంగా సుమారు రూ.35లక్షలు, గరిష్ఠంగా రూ.1.80కోట్లను మిల్లుల యజమానులు బ్యాంకు గ్యారంటీగా సమర్పించాల్సి ఉంటుంది. జిల్లాల వారీగా కేటాయించిన ధాన్యానికి సంబంధించిన బియ్యం (కస్టమ్ మిల్లింగ్ రైస్) తిరిగి అప్పగిస్తేనే ముందస్తుగా సమర్పించిన బ్యాంకు గ్యారంటీలను ఆ జిల్లాలోని మిల్లులన్నింటికీ తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ నిబంధనను జిల్లాల వారీగా కాకుండా మిల్లుల వారీగా అమలుచేయాలని మిల్లర్లు కోరుతున్నారు. మిల్లర్లు, ప్రభుత్వం మధ్య చర్చలు త్వరగా కొలిక్కిరావాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

**అన్నదాతలకు అన్నీ కష్టాలే...**

కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన తరువాత వర్షానికి ధాన్యం తడిసినా సంబంధిత రైతులే బాధ్యత తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. మిల్లుల వద్ద దిగుమతిలో జాప్యం జరిగినా లారీలో ఉక్కపోతకు ధాన్యం తేమశాతం పెరుగుతుంది. తీరా మిల్లులకు చేరిన తరువాత మిల్లర్లు ధాన్యం పరీక్షించి తాలు ఉందంటూ.. క్వింటాకు 10కిలోల తరుగు తీస్తామంటున్నారు. తిరుగు రవాణా ఖర్చులు భరించలేక నష్టమైనా సరే అన్నదాతలు అంగీకరిస్తున్నారు. కొందరు రైతులు ఈ సమస్యలను తట్టుకోలేక ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.300-400 తక్కువకు దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. సన్నరకం ధాన్యంపై క్వింటాకు 58-60 కిలోల బియ్యం మాత్రమే ఇవ్వగలం. అంతకుమించి అప్పగించలేమని అధికారులకు విన్నవించాం. బ్యాంకు గ్యారంటీ విషయంలోనూ నిబంధనలు సడలించాలి.

– బొమ్మా రాజేశ్వరరావు, మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం

# విస్తరణ 'దారి' కొచ్చేదెన్నడు?



కరీంనగర్ : ఇరుకిరుకు రహదారులు.. అడుగడుగునా గుంతలు.. వాహనాల రద్దీ.. నిత్యం ప్రమాదాలు.. ఇదీ ఉమ్మడి జిల్లాలోని ప్రధాన మార్గాల పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా విస్తరణకు నోచుకోక, ఎన్నికల సమయంలో నాయకులకు హామీలుగా మారుతున్నాయి. జాతీయ రహదారులుగా మార్చాలన్న ప్రతిపాదనలకు ఆమోదం లభించడం లేదు. అనుమతి వచ్చినా నిధుల విడుదలలో జాప్యం, సర్వే చేపట్టినా భూ సేకరణలో ఆలస్యం పరిపాటిగా మారింది.

1. నిజామాబాద్-జగిత్యాల-ధర్మపురి-జగదల్‌పూర్

నిజామాబాద్ నుంచి చత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ వరకు నిర్మించిన 63వ నంబరు జాతీయ రహదారి మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం మీదుగా వెళ్తుంది. ఉమ్మడి జిల్లాలో 69 కి.మీ. రహదారి విస్తరణకు రూ.2,581 కోట్లతో అంచనా వేశారు. మూడు చోట్ల బైపాస్ నిర్మించాలని సర్వేలో తేల్చారు. మొదట 224 హెక్టార్లు, తరువాత 304 హెక్టార్ల భూ సేకరణకు నిర్ణయించారు. దాదాపు మూడేళ్లుగా ప్రక్రియ కొనసాగుతుండగా వర్షాలకు లో లెవల్ వంతెనలు నీట మునుగుతున్నాయి.

2. కరీంనగర్-జగిత్యాల

ఉమ్మడి జిల్లాలో అత్యంత రద్దీగా ఉండే మార్గమిది. నిత్యం 22 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా ప్రమాదం జరగని రోజంటూ ఉండదు. ఎన్‌హెచ్-536 నిర్మాణంలో భాగంగా కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో 58 కి.మీ. మేర విస్తరించాల్సి ఉంది. ఆరేళ్ల కిందటే ప్రతిపాదనలు పంపగా ఇటీవల రూ.2,227 కోట్లు విడుదలయ్యాయి. పెద్దవి 27, చిన్నవి 29 కూడళ్లు, పాతవి కొత్తవి కలిపి 24 చోట్ల వంతెనలు నిర్మించాలి. వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ నిర్వహించనుండగా ఇప్పటికే సర్వే పూర్తయింది.

3. కరీంనగర్- రాయపట్నం

కోదాడ నుంచి కరీంనగర్ మీదుగా రాయపట్నం వరకు వెళ్లే ఈ మార్గంలో ఉమ్మడి జిల్లాలో 60 కి.మీ.లు విస్తరించాలి. జాతీయ రహదారులు ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) పదేళ్ల కిందటే సర్వే చేపట్టింది. దాదాపు ఆరేళ్ల కిందట రూ.1800 కోట్లతో అంచనా వేసినా నిధులు రాలేదు. గుంతలకు కనీస మరమ్మతు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. 4. జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం

తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల అనుసంధానానికి కీలకమైన మార్గం. ఉమ్మడి జిల్లాలో 130 కి.మీ. మేర విస్తరించగా జాతీయ రహదారిగా మార్చాలని పదేళ్ల కిందట ప్రతిపాదించారు. ఈ రహదారి విస్తరణతో సరకు రవాణా వాహనాలకు దూరాభారం తగ్గుతుంది. కరీంనగర్-గోదావరిఖని మార్గంలో రాజీవ్ రహదారిపై వాహనాల రద్దీ తగ్గుతుంది.

5. కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-పిట్లం

కరీంనగర్ నుంచి కామారెడ్డి మార్గంలో నాలుగు వరుసల విస్తరణ సహా జాతీయ హోదా ప్రక్రియ కొన్నేళ్లుగా అటకెక్కింది. ఆరేళ్ల కిందట కరీంనగర్ నుంచి సిరిసిల్ల వరకు రూ.199 కోట్లతో విస్తరణ పనులు చేపట్టినా ఇప్పటికీ పలు చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. జాతీయ రహదారిగా మారితే ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల మధ్య రవాణా మెరుగవుతుంది. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు జాతీయ రహదారి పనులు జరుగుతుండటంతో ఈ మార్గాన్ని విస్తరించాలన్న డిమాండ్ పెరుగుతోంది.

# జల చైతన్యం.. జన భాగస్వామ్యం



పెద్దపల్లి : వాతావరణ మార్పులు, మానవ తప్పిదాలతో ఏటికేడు భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వేసవిలో నీటి ఎద్దడితో రైతులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో పడుతున్న లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఎక్కడి నీరు అక్కడే ఇంకేలా 'జల సంచాయి, జన భగీదర'లో భాగంగా 'జల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉపాధిహామీ కూలీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో అధికారులు రంగంలోకి దిగారు.

**కార్యక్రమం తీరు**

ఉపాధి కూలీలు ప్రజలకు జల సంరక్షణపై చైతన్యం కల్పించనున్నారు. వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ప్రోత్సహించనున్నారు. జిల్లాల వారీగా ఎన్ని నివాస గృహాలు ఉన్నాయి? ఇంకుడు గుంతలు ఎన్ని నిర్మించారు? సమతల, కాంటూరు కందకాలు ఎన్ని ఉన్నాయో అనే వివరాలు సేకరిస్తున్నారు. ప్రజల అవసరాలను బట్టి కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదించనున్నారు. కొండలు, గుట్టల దిగువ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో కాంటూరు కందకాలు తవ్వించుకునేలా రైతులను ప్రోత్సహించనున్నారు. ఇందులో మున్సిపల్, అటవీ, ఇతర శాఖల భాగస్వామ్యం తీసుకోనున్నారు.

**కనీస బాధ్యత**

వర్షాలు కురిసినప్పుడు ఇంటి పైభాగంలోని నీటిని ఇంకుడుగుంతల ద్వారా భూగర్భంలోకి ఇంకించడం. చేతిపంపుల వద్ద సామూహిక, ఇళ్లల్లో వ్యక్తిగత ఇంకుడుగుంతలు నిర్మించడం. వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు, కాంటూరు కందకాలు, సమతల కందకాలు తవ్వడం. అవసరమైన ప్రాంతాల్లో చిన్నపాటి కుంటలు, నీటి నిల్వ కుంటలు, చెక్‌డ్యాంలు. వ్యవసాయ మోటార్లకు ఆటోమెటిక్ స్టార్టర్లు అమర్చుకోవాలి. బోర్ల తవ్వకాలపై పర్యవేక్షణ పెంచాలి. ఇంటికొక ఇంకుడుగుంత తప్పకుండా నిర్మించాలి.


నీటి సంరక్షణపై చైతన్యం చేస్తాం నీటి సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తాం. ఇప్పటికే వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాం. ఇంకుడుగుంతలు లేని ఇళ్లను గుర్తించి కొత్తగా నిర్మించేందుకు ప్రోత్సహిస్తాం. ప్రజలకు నీటి సంరక్షణపై చైతన్యం కల్పిస్తాం. రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# వీడని జ్వరం.. తగ్గని ఒళ్లు నొప్పులు

కరీంనగర్ : వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు, జలుబు, దగ్గు, తదితర జబ్బులు వస్తుంటాయి. జులై నెలలో వర్షాలు కురిసిన అనంతరం మొదలైన రోగాలు చలికాలం వచ్చినా ప్రజలను వీడటంలేదు. ఇప్పటికీ ప్రతిరోజు జిల్లా ఆసుపత్రిలో వెయ్యికి పైగా ఓపీ నమోదవుతోంది. చికున్‌గన్యా, డెంగీ వంటి వ్యాధులతో రావడంలేదని, కేవలం చిన్నపాటి జ్వరం దగ్గు, జలుబుతో రోగులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. రక్త పరీక్షలు అవసరంలేదని కేవలం మందులతోనే వ్యాధి తగ్గుతుందని ఆందోళన పడాల్సిన అవసరంలేదని సూచిస్తున్నారు. చిన్నపాటి వ్యాధులతో ఇక్కడి వరకు వస్తుండటంతో దీర్ఘకాలిక రోగులకు అత్యవసర వైద్యం అందడంలో ఆలస్యమవుతోంది. కాలానుగుణ వ్యాధుల నిమిత్తం ఆసుపత్రిలో వైద్యాధికారులు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. పరిమితికి మించి రోగులు వచ్చినా వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. అధిక శాతం మంది వైద్యుడికి చూపించుకొని ఇళ్లకు వెళ్తున్నారు. దీంతో ఆసుపత్రిలో మంచాలు ఖాళీగా ఉంటున్నాయి. వైరల్ జ్వరాల తర్వాత చాలామంది ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. నెల నుంచి ఆరు నెలల వరకు ఇబ్బంది పడుతున్నారు. వారికి తాత్కాలిక ఉపశమనం కోసం వైద్యు మందులు ఇచ్చి పంపిస్తున్నారు. నొప్పులు క్రమంగా తగ్గుతాయని ఆందోళన చెందానవసరంలేదని వైద్యులు చెబుతున్నారు.

**భరోసా కల్పించేలా చర్యలు అవసరం..**

చాలా మంది చిన్న జబ్బులకు ఇక్కడి వరకు రావడంతో ప్రధాన రోగులకు, ఆసుపత్రి వైద్యాధికారులకు ఇబ్బందిగా మారుతుంది. సమీప దవాఖానాల్లో సరిగా వైద్యం అందదనే భావనతోనే చాలా మంది పెద్ద దవాఖానాకు వస్తున్నారు. బస్తీ, పల్లెల్ల దవాఖానాల్లోనూ నాణ్యమైన



వైద్య సేవలందుతాయని ఉన్నతాధికారులు భరోసా కల్పించాల్సిన అవసరముంది. అలా చేస్తే అత్యవసర రోగులకు ఇక్కడ సేవలు ఆలస్యంగా కాకుండా ఉంటాయి. అందరూ వచ్చి ఓపీ లైనులో ఉండటంతో అత్యవసరమైన వారికి చికిత్స అందడంలో ఆలస్యమయ్యే అవకాశముంది.

**మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం**

ఆసుపత్రిలో ఓపీ రద్దీ అధికంగానే ఉంటుంది. చాలామంది జ్వరం, దగ్గు, జలుబుతో వస్తున్నారు. వారికి మందులతో తగ్గిపోతుంది. వైద్యసిబ్బంది అందరూ విధి నిర్వహణలో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# ఇసుక పోసే కొద్దీ అక్రమాలు

కొత్తగూడెం: ఇసుక అక్రమ రవాణాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్డాగా మారుతోంది. ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ క్వారీల్లో అడ్డదారిలో దందా సాగిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అడపాదడపా అధికారులకు చిక్కుతున్నప్పటికీ వ్యూహాలు మార్చి దందా సాగిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. తెలంగాణ రాష్ట్ర ఖనాజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్వారీల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతుందనటానికి ఇటీవల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మైనింగ్ అధికారులు నమోదుచేసిన కేసులే నిదర్శనం. **55 కేసులు.. రూ.14లక్షల జరిమానా**

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక అక్రమ రవాణా వాహనాలపై 55 కేసులు నమోదుచేశారు. వీటికి రూ.14,62,800 జరిమానా విధించినట్లు మైనింగ్ ఏడీ దినేష్‌కుమార్ వెల్లడించారు. గోదావరి పరీవాహక మండలాలు పినపాక, చర్లలోని ఇసుక రీచుల్లో క్వారీ నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిమితికి మించి ఇసుక లోడ్ చేస్తున్నారని, ఒక్కో బకెట్ ఇసుకకు రూ.2వేలు కాజేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇందుకు కొంతమంది టీజీఎండీసీ అధికారుల సహకారముందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా అక్రమ రవాణాను కట్టడి చేయాల్సిన తనిఖీ కేంద్రాల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

**2022-23లో రూ.35కోట్ల ఆదాయానికి గండి**

ఏటా ప్రభుత్వానికి రూ.వందల కోట్ల ఆదాయం సమకూరుతుందని టీజీఎండీసీ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇసుక రవాణాలో అక్రమ దందాను అరికడితే సర్కారుకు మరింత రాబడి సమకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. భద్రాద్రి జిల్లాలోని ఇసుక రీచ్‌ల ద్వారా 2022-23లో సర్కారుకు రూ.1,36,29,95,400 రాబడి వచ్చింది. సుమారు 25శాతం ఇసుక అక్రమ రవాణా జరిగినట్లు సమాచారం. దీన్నిబట్టి సర్కారు దాదాపు రూ.35 కోట్ల ఆదాయం కోల్పోయినట్టే. పరిమితికి మించి లారీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

**క్వారీలొస్తేనే.. కట్టడి**

జిల్లాలో ప్రస్తుతం పినపాక, చర్ల మండలాల్లోని రీచ్‌ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. గతంలో మొత్తం పది రీచ్‌ల ద్వారా 7,95,285 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు అనుమతులివ్వటానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానంలో లోపాలున్నాయని.. వాటిని సవరించటానికి నూతన విధానం తెస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. రీచ్‌లకు అనుమతుల ప్రక్రియ ఆదిలోనే ఆగిపోయింది. ప్రభుత్వం ఇసుక రీచ్‌లను కేటాయించాలని గిరిజన సొసైటీలు దరఖాస్తు చేసుకున్నా మోక్షం లభించటం లేదు. రీచ్‌లను మంజూరు చేస్తే ఇసుక లభ్యత పెరిగి అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇసుక రీచ్‌ల్లో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశాం. ఇసుక అక్రమ రవాణాకు అవకాశం లేకుండా చూస్తున్నాం. సిబ్బందితో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశాం. అనుమానం వచ్చిన వాహనాలను స్వాధీనపరచుకొని వివరాలు సేకరిస్తున్నాం.

– శంకర్‌నాయక్, టీజీఎండీసీ పీఓ, భద్రాద్రి కొత్తగూడెం

# అనుసంధానం మరింత ఆలస్యం..!

ఖమ్మం : సీతారామ ప్రాజెక్టు నుంచి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాల మళ్లింపులో కీలకమైన పాలేరు అనుసంధాన కాల్వ తవ్వకానికి సంబంధించిన 13వ ప్యాకేజీ టెండర్ గడువును ఈనెల 16 వరకు అధికారులు పొడిగించారు. ఖమ్మంలోని నీటిపారుదలశాఖ ఎస్‌ఈ (సూపరింటెండెంట్ ఇంజినీర్) కార్యాలయం నుంచి టెండర్లు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు నీటిపారుదలశాఖ అధికారులు టెండర్ గడువు పొడిగించినట్లు తెలిసింది. సుమారు ఎనిమిదేళ్ల తర్వాత గతనెల 25న 13వ ప్యాకేజీ పనులకు రూ.191 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వానించారు. ఆన్‌లైన్‌లో గుత్తేదారులు టెండర్లు దాఖలు చేసేందుకు ఈనెల 8వ తేదీని గడువుగా



నిర్ణయించారు. తాజాగా 16 తేదీ వరకు గడువు పొడిగించటం గమనార్హం. చివరి రోజు సాయంత్రం 5 గంటల తర్వాత ఖమ్మంలోని ఎస్‌ఈ కార్యాలయంలో టెండర్లు తెరవాల్సి ఉంటుంది.

**చీమలపాడు నుంచి బురదరాఘవాపురం వరకు..**

పాలేరు అనుసంధాన కాల్వ ఆరంభంలో 10.50 కి.మీ. పొడవున తవ్వకం పనులు 13వ ప్యాకేజీలో ఉన్నాయి. 14, 15, 16 ప్యాకేజీ పనులను రెండేళ్ల క్రితమే చేపట్టారు. కాల్వ తవ్వకానికి 345 ఎకరాలను సేకరించాల్సి ఉంది. ఇందులో 225 ఎకరాలు రిజర్వ్ ఫారెస్టు భూములు. వీటికి దిల్లీ స్థాయిలో అనుమతులు రావాల్సి ఉంది. చీమలపాడు, బాజుమల్లాయిగూడెం గ్రామాలకు చెందిన పలువురు రైతుల నుంచి 120 ఎకరాల పట్టా భూములు సేకరించాలి. ఇందుకు రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. సింగరేణి మండలం చీమలపాడు నుంచి ఏన్కూరు మండలం బురదరాఘవాపురం వరకు కాల్వ తవ్వాలి.

**గుత్తేదారుల లాబీయింగ్**

పాలేరు అనుసంధాన కాల్వ 13వ ప్యాకేజీ పనులు దక్కించుకునేందుకు పలువురు గుత్తేదారులు ఉన్నతస్థాయిలో లాబీయింగ్ జరుపుతున్నట్లు తెలిసింది. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సుల కోసం ఖమ్మంకు చెందిన బడా గుత్తేదారు రాజధానిలోనే మకాం వేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల్లో గతంలో తనకు అన్యాయం జరిగిందని, ఒక్క ప్యాకేజీ అయినా రాలేదని, ఈసారి ఎలాగైనా తనకు ఇప్పించాలని కోరుతున్నట్లు తెలిసింది. పనుల కోసం పోటీపడుతున్న పలువురు గుత్తేదారులు తమకు మంత్రుల హామీ లభించినట్లు ప్రచారం సాగిస్తున్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల అనుయాయులు తమకు సంబంధించిన కంపెనీలకు 13వ ప్యాకేజీ పనులు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు పెద్దలతో సన్నిహిత సంబంధాలు కలిగిన కడప జిల్లాకు చెందిన బడా కాంట్రాక్టర్ సైతం ఈ పనులపై కన్నేసినట్లు సమాచారం.

**ఖమ్మం ఎస్‌ఈ పోస్టు ఖాళీ..**

నీటిపారుదలశాఖలో వివిధ టెండర్లు ఆహ్వానించాల్సిన ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ పోస్టు ఖాళీగా ఉంది. అక్టోబర్ 31న నర్సింగరావు ఉద్యోగ విరమణ పొందగా కొత్తగా ఎవరినీ నియమించలేదు. ఇన్‌ఛార్జి బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు. కీలక సమయంలో ఎస్‌ఈ పోస్టు గాలిలో దీపంలా మారటంతో సర్కిల్‌లోని అధికారులు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

# త్వరలో.. జంట జలాశయాలకు హద్దులు

హైదరాబాద్: జంట జలాశయాలకు హద్దులను పక్కాగా గుర్తించేందుకు హైడ్రా నడుం బిగించింది. జాతీయ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్ఆర్ఎస్ఏ), సర్వే ఆఫ్ ఇండియా(ఎస్ఓఐ) పటాల ఆధారంగా.. వాస్తవ విస్తీర్ణాన్ని కనుగొనేందుకు కమిషనర్ ఎ.వి.రంగనాథ్ చర్యలు ప్రారంభించారు. ఆమేరకు ఎస్ఆర్ఎస్ఏ, ఎస్ఓఐలతో హైడ్రా ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకుంది. క్షేత్రస్థాయి సర్వే చేపట్టి, పూర్తిస్థాయి నీటి మట్టం(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లను కనిపెట్టేందుకు అధికారులు రంగంలోకి దిగారు. మొదట హిమయత్‌సాగర్, తర్వాత ఉస్మాన్‌సాగర్‌లో సర్వే జరుగుతుంది.

**గడిచిన 14ఏళ్లలో..** పాత రికార్డుల ప్రకారం.. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో కలిపి దాదాపు 800 ఆక్రమణలు ఉంటాయని అంచనా. వాటి ఆధారంగానే ప్రారంభంలో హైడ్రా హిమయత్‌సాగర్‌పరిధిలోని అనేక విల్లాలు, విడిది గృహాలు, రెస్టారెంట్లు, స్పోర్ట్స్ విలేజ్‌లు, ఇతర నిర్మాణాలను కూల్చింది. తర్వాత.. వేర్వేరు పార్టీల నేతలు హైడ్రా చర్యలను తప్పుబట్టారు.



ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఎప్పుడు నిర్ధారించారంటూ ప్రశ్నించారు. అనంతరం.. కమిషనర్ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎస్ఆర్ఎస్ఏ, సర్వే ఆఫ్ ఇండియాలను సంప్రదించారు. ఉమ్మడి కార్యాచరణపై స్పష్టత రావడంతో.. తాజాగా అధికారులు సర్వే ప్రారంభించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను పక్కాగా గుర్తించి, హద్దు పొడవునా కొన్ని పాయింట్లజియోట్యాగ్ చేస్తామని హైడ్రా యంత్రాంగం పేర్కొంటోంది.

**411 చెరువులకు కూడా..**

ఔటర్ లోపల ఉన్న 411 తటాకాలపై ఇటీవల హైడ్రా ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రజల నుంచి ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించి, తుది నోటిఫికేషన్ ఇవ్వాలన్నది ఉద్దేశం. చెరువుల పరిరక్షణలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదంటున్నారు.

# లక్ష్యం మారింది. ఇక నగర సమస్యలపై గురి

హైదరాబాద్: రాజధానిలోని ప్రధాన సమస్యలపై హైడ్రా దృష్టి సారించింది. చెరువుల ఆక్రమణ, ట్రాఫిక్ చిక్కులు, పార్కులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను సరి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగా హెచ్చరించే అత్యాధునిక వ్యవస్థను కూడా ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని యోచిస్తోంది. చెరువుల పునరుజ్జీవం: హైడ్రా అధికారులు అనేక చోట్ల నివాసాలను కూల్చడంతో పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. దీంతో కొన్నాళ్లు కూల్చివేతలకు దూరంగా ఉంది. నాలుగైదు నెలలు నగర సమస్యలపై దృష్టిసారించాలని నిర్ణయించింది. వంద చెరువులకు సంబంధించి జాబితాను పురపాలక శాఖ అధికారులకు హైడ్రా అప్పగించింది. ముందుగా నాలుగైదు చెరువులను నమూనాగా పూర్వ



ఆకృతిని తేవాలనుకుంటున్నారు.

ట్రాఫిక్ సమస్య: రోజూ కనీసం 60 లక్షల వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. వీటికి తగినట్టు రోడ్ల విస్తరణ లేదు. ఇటీవల హైడ్రా, ట్రాఫిక్, బల్దియా, జలమండలి అధికారులు కలిసి పర్యటించారు.

పాదుబాట ఇలా

ఒక వైపు నాలాలు.. మరోవైపు పాదబాటలు చాలాచోట్ల ఆక్రమణకు గురయ్యాయి. నగరంలోని 9 వేల కి.మీ పొడవునా ఉన్న నాలాల్లో 75 శాతం మేర ఆక్రమణకు గురయ్యిందో ఆ ప్రాంతాన్ని గుర్తించి చర్యలు తీసుకోనున్నారు.

నగరంలో బెంగళూరు తరహా ప్రకృతి విపత్తుల హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నారు. ప్రధాన ప్రాంతాల్లో సెన్సర్ల ఏర్పాటును పరిశీలిస్తున్నారు.

## నాణ్యత కరవు.. అధికారులు పట్టించుకోరు

ఆదిలాబాద్ : జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన భవన నిర్మాణాల్లో కనీస నాణ్యత లేక ప్రారంభానికి ముందే పగుళ్లు తేలడం విస్మయానికి గురిచేస్తోంది. సంబంధిత అధికారులు అటువైపు దృష్టి సారించిన దాఖలాలు లేవు. సంబంధిత గుత్తేదారుపై చర్యలు తీసుకోవడంలోనూ వెనుకడుగు వేస్తున్నారు. వెరసి ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పైన పటారం.. లోన లొటారంఆదిలాబాద్ పట్టణంలో నిర్మించిన తూనికలు, కొలతల శాఖ భవనం నాణ్యతలేమి, అధికారుల పర్యవేక్షణ తీరును బట్టబయలు చేస్తోంది. పగుళ్లు తేలితే దానికి అతుకులు వేసి గుత్తేదారు మాయ చేస్తున్నాడు. భవన నిర్మాణానికి 2022లో రూ.28.53 లక్షలు మంజూరయ్యాయి. 2023 మార్చిలో పూర్తి చేశారు. చేసిన పనుల్లో నాణ్యతలోపం కనిపిస్తోంది. పట్టించుకోని అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రారంభానికి ముందే పగుళ్లు

ఇది ఇచ్చోడలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనం. 2020లో మంజూరు కాగా నేటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. పనుల తీరు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. సంబంధిత గుత్తేదారు పైపైపనులు చేపట్టి మమ అనిపించారు. భవనం అప్పుడే పగుళ్లు తేలింది. నిరుపేదలకు వైద్య సేవలు అందించాల్సిన ఈ భవనం పరిస్థితి అధ్వానంగా మారడంతో అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై ఐటీడీఏ ఏఈ ప్రదీప్‌ను వివరణ కోరగా.. నేను ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. భవన వివరాలు కనుక్కుంటాను. అసంపూర్తిగా ఉంటే పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

# సైబరాబాద్‌లో 27 కొత్త పోలీస్‌స్టేషన్లు




హైదరాబాద్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. 27 కొత్త ఠాణాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. 7 శాంతి భద్రతలు, 12 ట్రాఫిక్, 4 సైబర్‌క్రైమ్, 4 మహిళా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటుచేయాలని, ఆమనగల్లు సర్కిల్‌ను సబ్‌డివిజన్ స్థాయికి పెంచాలని నివేదిక పంపారు. వీటితోపాటు ప్రస్తుతమున్న 38 పోలీస్ స్టేషన్ల కేటగిరీలవారీగా హోదా పెంచాలని నిర్ణయించారు.

**సైబర్ నేరాలపై గురి:** కొత్తగా నాలుగు సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో అత్యధిక సైబర్ నేరాలు సైబరాబాద్ కమిషనరేట్‌లోనే నమోదవుతున్నాయి. 2023లో 5,342 కేసుల్లో రూ.232 కోట్లు పోగొట్టుకోగా.. 2024లో కేసుల సంఖ్య 7వేలు దాటింది.

**మహిళలకు భరోసా ఇచ్చేలా**

తాజా ప్రతిపాదనల్లో జోన్‌లో నాలుగు మహిళా పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సైబరాబాద్‌లో ఒకే మహిళా పోలీస్‌స్టేషన్ ఉంది. దీనికి కేసుల భారం ఎక్కువగా ఉండడంతో అదనంగా కొత్త పోలీస్‌స్టేషన్లను ప్రతిపాదించారు. ఐటీ కారిడార్, శివారు ప్రాంతాల్లో వాహనాల రద్దీ నియంత్రణలో భాగంగా ఒకేసారి 12 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం రెండే ఉన్నాయి.

**రాచకొండలో ఈవోడబ్ల్యూ**

రాచకొండ కమిషనరేట్‌లో కొత్తగా ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆర్థిక నేరాలపై దర్యాప్తు చేసేందుకు సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్లకు ప్రత్యేకంగా డీసీపీల నేతృత్వంలో ఈవోడబ్ల్యూ విభాగాలు, పోలీస్‌స్టేషన్లున్నాయి. రూ.75 లక్షలకు మించి ఆర్థిక మోసాల కేసుల్ని ఈ విభాగాలే దర్యాప్తు చేస్తున్నాయి. రాచకొండలో ఈ పరిస్థితి లేదు. ఈనేపథ్యంలోనే ఈవోడబ్ల్యూ విభాగం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. భవిష్యత్తులో దీనిస్థాయి కూడా పెంచేందుకు కసరత్తు జరుగుతోంది.

# దత్తత.. అప్రమత్తత



సంగారెడ్డి : దత్తత.. పిల్లలు లేని తల్లిదండ్రులకు వరం. మరో కోణంలో చూస్తే.. అనాథ చట్టబద్ధంగా సంతానం పొందే వెసులుబాటుశిశువులకు ఆసరా దొరకడమే. సంతానలేమితో కుంగిపోతున్న దంపతులకు చట్టబద్ధంగా బాలబాలికలను దత్తత అందించే క్రతువును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో భారీ సంఖ్యలో దంపతులు దత్తతకు ఆసక్తి చూపుతున్నారు. నేడు ప్రపంచ దత్తత దినోత్సవం సందర్భంగా ఆయా నిబంధనలపై ప్రత్యేక కథనం.

ఆరేళ్లలోపు అనాథలు, సంరక్షకులు లేని బాలబాలికలు శిశుగృహాలో వసతి పొందుతున్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ విభాగం దీన్ని పర్యవేక్షిస్తోంది. సంతానం లేని దంపతులకు దత్తత ప్రక్రియ వరంలా మారింది. సంగారెడ్డిలో 2010లో, సిద్దిపేటలో గతేడాది, వికారాబాద్‌లో 2014 లో శిశు గృహ (స్పెషలైజడ్ అడాప్షన్ ఏజెన్సీ)లు ఏర్పాటయ్యాయి.

**నిబంధనలు ఇలా..**

పిల్లలు లేని దంపతులు అర్హులు.

ఒంటరి మహిళ లేదా పురుషుడు దత్తత తీసుకోవచ్చు.

మహిళలు బాలుడు లేదా బాలికను దత్తత తీసుకునే సదుపాయం.

పురుషులకు మాత్రం మగ శిశువును మాత్రమే అందిస్తారు.

దంపతులు ఎవరినైనా ఎంచుకోవచ్చు.

ఆన్‌లైన్ ద్వారా ఏ రాష్ట్రమనేది ఎంచుకోవచ్చు.

ఆరునెలలకోసారి..

ఎంపిక చేసిన దరఖాస్తుదారులను నిర్దేశిత జిల్లాలోని శిశుగృహకు ఆహ్వానిస్తారు. నిబంధనలు వివరించి, అడాప్షన్ అండ్ ఫాస్టర్ కేర్ కమిటీ ముఖాముఖి నిర్వహించి చిన్నారిని అప్పగిస్తారు. కలెక్టర్ ద్వారా సంబంధిత ఉత్తర్వు అందిస్తారు. ప్రతి ఆరు నెలలకోమారు అధికారుల అనుశీలన ఉంటుంది. రెండేళ్ల పాటు కొనసాగుతుంది.

**దరఖాస్తు విధానం...**

'సీఏఆర్ఏ' (సెంట్రల్ అడాప్షన్ రిసోర్సు అథారిదరఖాస్తు విధానం.. టీ) వెబ్‌సైట్‌లో తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పేరు, చిరునామా, విద్యార్హత తెలిపే ధ్రువపత్రాలు, ఇతర సమాచారం పొందుపర్చాలి. లేదంటే శిశుగృహకు వెళ్తే అవగాహన కల్పిస్తారు. బాలల పరిరక్షణ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి అర్హుల జాబితాను ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వారికి ఫోన్, ఈ-మెయిల్‌కు చిన్నారి వివరాలు పంపిస్తారు. నచ్చిన వారిని ఎంచుకోవచ్చు.

**అమ్మాయే కావాలి**

ఆడపిల్ల పుడితే భారమని భావించడం ఒకప్పటి పరిస్థితి. ఇప్పుడది మారింది. చిన్నారుల దత్తత తీరు దీన్నే సూచిస్తోంది. అమ్మాయిలను దత్తత తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ శిశుగృహాల ద్వారా దత్తత తీసుకున్న వారిలో అమ్మాయిలే అధికం. పలువురిని విదేశాలకు సైతం తీసుకెళ్లారు.

**ఎవర్ని ఇస్తారంటే..**

అనాథలు, తల్లిదండ్రుల సంరక్షణ కరవై నిర్లక్ష్యానికి గురైన బాలలను నిబంధనల మేర దత్తత ఇస్తారు. ఆరేళ్లలోపు బాలబాలికలు శిశు గృహాలో ఉంటారు. ఆపై వయసున్న వారు బాలల సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతారు. దరఖాస్తు చేసిన అనంతరం కొన్ని సందర్భాల్లో సమయం ఎక్కువగా పడుతుంది.

**రక్త సంబంధీకులు సులువుగా..**

ఎవరైనా రక్త సంబంధం కలిగి ఉండి.. తమ బంధువుల పిల్లలను నిబంధనల మేరకు దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. రక్త సంబంధీకులు సులువుగా ఈ ప్రక్రియను చేపట్టవచ్చు. సీఏఆర్ఏ (సెంట్రల్ అడప్షన్ రిసోర్సు అథారిటీ) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలి. దత్తత ఇచ్చిపుచ్చుకునే వారి సమ్మతి, 12 ఏళ్లపైబడిన బాలలైతే వారి అంగీకారం కచ్చితం.

**అర్హులకే ప్రాధాన్యం : లలిత, జిల్లా సంక్షేమాధికారిణి, సంగారెడ్డి**

చట్టబద్ధమైన దత్తతే తీసుకోవాలి. ఇందుకు భిన్నంగా వ్యవహరించే వారిపై చర్యలు ఉంటాయి. శిశుగృహాలోని చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. అర్హులకే పిల్లలను దత్తత ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. దత్తతకు ముందుకొచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతోనే సలహా కేంద్రాన్ని ఏర్పాటుచేశాం.

ప్రస్తుతం శిశుగృహాలో ఉన్నవారు: 08

ఇప్పటివరకు దత్తత ఇచ్చింది: 59 మంది

ఈ ఏడాదిలో ఇప్పటివరకు..: 12 మంది

# నాలుగేళ్లుగా క్వింటా కొంటే ఒట్టు

వేములవాడ: గతంలో రైతులు పండించిన పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలతో కళకళలాడిన వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రస్తుతం అస్తిత్వం కోల్పోయింది. నాలుగేళ్ల క్రితం కొనుగోలు చేసిన ధాన్యమే చివరి కొనుగోళ్లు అయ్యాయి. గతంలో ప్రతి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం, కందులు, మక్కలు, పత్తి క్రయ,విక్రయాలతో ఈ మార్కెట్ సందడిగా ఉండేది. అలాంటిది గత పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు అలంకారప్రాయంగా మారింది.

వేములవాడ చుట్టు పక్కల మండలాలైన బోయినపల్లి, కోనరావుపేట, రుద్రంగి మండలాల రైతులు పండించిన పంట ఉత్పత్తులను ఇక్కడికి తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం ఆ ఆనవాళ్లు కనిపించడం లేదు. వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 10 కోట్లు వెచ్చించి రైతుల కోసం అన్ని సదుపాయాలు కల్పించారు.

యార్డు మొత్తం సీసీ నిర్మాణం, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు గోదాంలు, రైతులకు విశ్రాంతి గది నిర్మించారు.ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించేందుకు రైతు సమాచార కేంద్రం ఏర్పాటు చేశారు.

మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం ఇవన్నీ నిరుపయోగంగా మారాయి.

**ప్రతిపాదనల్లోనే కొత్తది**

వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు దాదాపు అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో నాలుగేళ్ల క్రితం రెండు ఎకరాల స్థలాన్ని వేములవాడ మున్సిపల్‌కు అప్పగించారు. ఈ స్థలంలో మున్సిపల్ నిధులు రూ.4.50 కోట్లతో సమీకృత కూరగాయలు, మాంసం విక్రయ మార్కెట్ కోసం భవన నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇక్కడ వ్యవసాయ మార్కెట్‌కు స్థలం సరిపోదని గ్రామీణ మండలంలోని మర్రిపల్లిలో దాదాపు 13 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ప్రతిపాదనలు చేసి స్థలాన్ని పరిశీలించినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు.

**దళారులదే ఇష్టారాజ్యం**

వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయించేందుకు రైతులు



పంట ఉత్పత్తులను తీసుకురావడం లేదనే కుంటిసాకుతో మార్కెట్ కమిటీ అధికారులు తప్పించుకుంటున్నారు.

మార్కెట్ పరిధిలో దాదాపు 20 మంది లైసెన్స్ పొందిన వ్యాపారులు ఉన్నారు. వీరంతా గ్రామాల్లో కాంటాలు పెట్టి తూకాలు చేస్తున్నారే తప్పా యార్డులో కొనుగోళ్లు చేసిన దాఖలాలు లేవు.

దళారులు, కొంత మంది లైసెన్స్ వ్యాపారులు పెద్ద ఎత్తున గ్రామాల్లో ధాన్యం, పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ అన్నదాతలను నిలువునా ముంచుతున్నారు. తూకం వేసే కూలీలతో జత కట్టి క్వింటాల్‌కు 5 నుంచి 10 కిలోల వరకు మోసానికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

గ్రామాల్లో మార్కెట్ అధికారులు, తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేసిన సందర్భాలు లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా మోసాలు జరుగుతున్నాయి.

రైతులు ముందుకు రావడం లేదు

మార్కెట్ యార్డులో కొనుగోలు చేద్దామంటే రైతులు ముందుకు రావడం లేదు. యార్డులో రెండెకరాలు మున్సిపల్‌కు ఇవ్వడంతో స్థలం తగ్గిపోయింది. యార్డులో రైతులు తమ పంట ఉత్పత్తులు విక్రయించుకునేందుకు ముందుకు వస్తే కొనుగోలు చేస్తాం.సత్యనారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వేములవాడ

# శత శాతమే లక్ష్యం

వికారాబాద్ : పదో తరగతి ఫలితాల్లో రెండేళ్లుగా వికారాబాద్ జిల్లా అట్టడుగునే ఉంటోంది. ఈ దుస్థితినుంచి ఎలాగైనా ఈసారి బయట పడాలని, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది మంచి ఫలితాలు సాధించాలని జిల్లా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. 'శతశాతం రాబట్టడమే' లక్ష్యంగా ప్రణాళికలను సిద్ధం చేసి అమలుపై ఈ నెల 15 నుంచి పకడ్బందీగా ముందుకు వెళ్లనున్నారు .

**ప్రతి రోజూ గంట పాటు తరగతులు**

పాఠశాల ముగిసిన తరువాత సాయంత్రం 4.15 గంటలనుంచి నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఒక్కో సబ్జెక్టు ఉపాధ్యాయుడికి ఒక్కో రోజు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. డిసెంబరు తరువాత పరీక్షలు జరిగే వరకు మరో షెడ్యూల్ ప్రకటించి అమలు చేయనున్నారు. ఇప్పటికే అభ్యసన దీపికలను సైతం పూర్తి చేశారు. ఇందులో సబ్జెక్టుల వారీగా చాప్టర్లు ఉంటాయి.

**వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ**

తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా ప్రణాళికను సిద్ధం చేశారు. దీనికి అనుగుణంగా చదువులో వెనుకబడిన వారిని ఉపాధ్యాయులు దత్తత తీసుకుంటారు. పాఠశాలలతో పాటు ఇంటి వద్ద కూడా చదవించాలని ఇప్పటికే తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి రోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక తరగతులను



పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారు, వారు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారు. నిర్దేశిత పరీక్షల్లో వారికి వస్తున్న మార్కులు ఎలా ఉంటున్నాయి, వీటిని మెరుగు పరిచేందుకు కావాల్సిన సూచనలు అందించడం వంటివి అధికారులు చేస్తారు.

**మండల విద్యాధికారులు పరిశీలించాలి: రేణుకాదేవి, డీఈఓ**

నవంబరు నుంచి ప్రారంభం అయ్యే ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నాం. వెనుకబడిన విద్యార్థులను ఉత్తీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయులు దత్త తీసుకోవాలి. ప్రతి రోజూ ఒక్కో ఉపాధ్యాయుడు ఒక్కో సబ్జెక్టు బోధించాలి. మండల విద్యాధికారులు ప్రత్యేక తరగతులను సాయంత్రం పరిశీలించాలి.

మొత్తం విద్యార్థులు..12,846

వీరిలో ప్రభుత్వ.. 10,291

ప్రైవేటు.. 2,555

# ఉత్తమ ఫలితాలు 'పది'లమేనా!


పెద్దపల్లి : ఇటీవల పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా విద్యార్థులను ముందస్తు సన్నద్ధత చేస్తున్నప్పటికి కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. ఉపాధ్యాయుల కొరత తీర్చినా అవే ఫలితాలు పునరావృతమవుతున్నాయి. కొన్ని చోట్ల రవాణా సమస్యతో దూరప్రాంత విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరు కాకుండా ముందుగానే ఇంటికి వెళ్తున్నారు. పాఠశాలకు గైర్హాజరు శాతం కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నా విషయం. సాయంత్రం వేళలో అల్పాహారం లేక విద్యార్థులు చదువుపై ఏకాగ్రత నిలపలేకపోతున్నారు. ఈ అడ్డంకులు అధిగమిస్తేనే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు రానున్నాయి.

**లోపాలు సరిదిద్దితేనే ఉత్తమం**

జిల్లాలో 104 ప్రభుత్వ పాఠశాలల్లో 2,826 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. గడిచిన మూడేళ్ల ఫలితాలు పరిశీలిస్తే తొంబై శాతంపైనే ఉత్తీర్ణత నమోదైంది. జిల్లా రాష్ట్రస్థాయిలో పదో ర్యాంక్‌కే పరిమితమవుతోంది. మూడేళ్ల క్రితం ప్రత్యేకంగా ముద్రించి పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌ను ప్రతిఏటా వినియోగిస్తున్నారు. ప్రత్యేక సాధన చేసినప్పటికీ ఫలితాల్లో మెరుగు కాకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కూడా ఈ పరిస్థితి నెలకొంది.

**సాయంత్రం పూటనే**

గతంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించగా.. ఈ ఏడాది సాయంత్రం పూటనే నడుస్తున్నాయి. 4.15 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత 5.30 వరకు



కడుపులో ఏం పడకుండా చదువుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. అలసట, నీరసంతో పాఠాలు చెవికెక్కడంలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, దాతలు అల్పాహారం కోసం నిధులు కేటాయిస్తే విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారు.

**ఇవీ సమస్యలు**

కొన్ని పాఠశాలల్లో కీలక పోస్టులు ఖాళీ ఉన్న చోట ప్రత్యామ్నాయంగా సర్దుబాటు చేసిన అరకొరగా బోధిస్తున్నారు.

సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం లేక విద్యార్థులు అర్ధాకలితో పాఠాలపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు.

కొన్ని చోట్ల పదో తరగతి విద్యార్థుల గైర్హాజరు శాతం ఎక్కువగా ఉంది. వీరిని పాఠశాలకు తీసుకురావడంలో ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి.దూర ప్రాంత విద్యార్థులు బస్సులు లేకపోవడంతో ముందుగానే ఇంటికి వెళ్లడంతో ప్రత్యేక పాఠాలు కోల్పోవాల్సి వస్తోంది.

కొంత ఇబ్బందిగా ఉందిపాఠశాలలో రోజు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నా. ఉపాధ్యాయులు సబ్జెక్టుకు సంబంధించి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అయితే మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత సాయంత్రం వరకు బడిలో ఉండటం ఇబ్బందిగా ఉంది. అల్పాహారం లేక నీరసంగా అనిపిస్తోంది. నవ్య, పదోతరగతి, జడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు) గోదావరిఖని

# మాకిక్కడ.. మీకింకోచోట

హైదరాబాద్ : మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుకు రక్షణ భూముల సేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం రక్షణ శాఖతో సంప్రదింపులు చేయనున్నారు. వాటికి బదులుగా వేరే ప్రాంతం లో అంతకు విలువైన భూములను కేటాయిం చేం దుకు నిర్ణయించారు. మూడు మండలాల పరిధిలో 300 నుంచి 500 ఎకరాల రక్షణ శాఖ భూములున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే నగరంలో మొత్తం 55 కి.మీ పొడవున మూసీకి అటూ ఇటూ 50 మీటర్ల మేరకు ఆక్రమణలు, నిర్మాణాలను గుర్తించి వాటికి మార్కింగ్ వేసే ప్రక్రియ వేగంగా సాగుతోంది.ప్రత్యేకత: ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ తయారీకి తాజాగా మరోసారి నోటిఫికేషన్ జారీ చేశారు.



ప్రక్షాళనతో సరిపెట్టకుండా గుజరాత్‌లోని సబర్మతి, లండన్‌లోని థేమ్స్ మాదిరిగా సుందరీకరణ, బోటింగ్, ఫుడ్‌కోర్టులు, మాల్స్ వచ్చేలా రూపకల్పన చేయనున్నారు.

ఇబ్బందుల్లేకుండా..: భవిష్యత్తులో ఎఫ్‌టీఎల్‌కు ఎలాంటి ఆటంకం లేకుండా మూసీ పరిధిలో అభివృద్ధి చేయడం కీలకమని భావిస్తున్నారు. గండిపేట, రాజేంద్రనగర్, గోల్కొండ మండలాల్లో రక్షణశాఖకు వేలాది ఎకరాల భూములున్నాయి. మార్కెట్ ధరతో సమానంగా అంతే భూమిని రక్షణశాఖకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# జారీ ఇష్టారాజ్యం.. పర్యవేక్షణ పూజ్యం

హైదరాబాద్ : నగరంలో నకిలీ ట్రేడ్ లైసెన్సులు కుప్పలుతెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఆన్‌లైన్‌లో రూ.350 చెల్లిస్తే చాలు.. ఎలాంటి పత్రం లేకపోయినా ధ్రువీకరణపత్రం మంజూరవుతుంది. జీహెచ్‌ఎంసీ అమలు చేస్తోన్న 'ఇన్‌స్టాంట్ అప్రువల్' విధానమే అందుకు కారణం.అనుభవమైనా పట్టింపేది..? : గతంలో ఈ విధానం ఆస్తిపన్ను, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీకి కూడా అందుబాటులో ఉండేది. స్వీయ మదింపు పేరుతో కేటుగాళ్లు 35వేల నకిలీ ఇంటి నెంబర్లను, 27వేల నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. ఆయా పత్రాలను ఉపయోగించి అక్రమార్కులు అనేక మోసాలకు పాల్పడ్డారు. దీంతో అప్పట్లో ఆస్తిపన్ను, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీలోని 'ఇన్‌స్టాంట్ అప్రువల్' విధానాన్ని రద్దు చేశారు. ట్రేడ్ లైసెన్సుల జారీపై నిర్ణయం తీసుకోలేదు. దీంతో నాలుగేళ్ల నుంచి దాదాపు 50వేల ట్రేడ్ లైసెన్సులు పుట్టుకొచ్చి ఉంటాయని అంచనా.

**తెల్ల కాగితాలు అప్‌లోడ్ చేసి..**




మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ గురువారం రెండు నకిలీ ట్రేడ్ లైసెన్సులను సృష్టించాడు. ఆన్‌లైన్ దరఖాస్తులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేరును చేర్చి, డ్రగ్స్ మార్ట్ వ్యాపారాన్ని తెరిచేందుకుగాను లైసెన్సు కావాలంటూ, తెల్ల కాగితాలు అప్‌లోడ్ చేసి లైసెన్సులు పొందారు. గతంలో మల్కాజిగిరి సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం భవనానికి మేయర్‌ని యజమానిగా పేర్కొంటూ నకిలీ ఇంటి నెంబరును సృష్టించారు.

**సగానికి పైగా నకిలీవే..**

కొత్తగా 2022లో 43,888 లైసెన్సులు, 2023లో 54,744, 2024(ఏప్రిల్ వరకు)లో 4,646 లైసెన్సులు జారీ కాగా.. వాటిలో సగానికిపైగా నకిలీవేననే ఆరోపణలు ఉన్నాయి. దుకాణ విస్తీర్ణాన్ని తక్కువగా చూపించి కొందరు లైసెన్సు పొందుతున్నారు. ఇలా జీహెచ్‌ఎంసీ గత నాలుగేళ్లలో రూ.50కోట్ల నష్టపోయినట్లు అంచనా.

# ఎంపాక్స్... ప్రత్యేక వార్డులు సిద్ధం

హైదరాబాద్ : ప్రపంచవ్యాప్తంగా ఎంపాక్స్ (మంకీపాక్స్) అలజడి రేకెత్తిస్తున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే గాంధీ, నల్లకుంట ఫీవర్ ఆసుపత్రులను సిద్ధం చేసింది. అక్కడ ప్రత్యేక వార్డులు నెలకొల్పింది. గాంధీలో 20 పడకలు కేటాయించారు. ఇందులో పురుషులకు, మహిళలకు పదేసి పడకలు కేటాయించినట్లు గాంధీ వైద్యులు పేర్కొన్నారు. ఫీవర్ ఆసుపత్రిలో ఆరు పడకలు అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాకపోయినా అప్రమత్తంగా ఉండటం అవసరమని వైద్యులు చెబుతున్నారు.

వ్యాప్తి ఇలా.. ఎంపాక్స్ లక్షణాలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కాంగో, నైజీరియా, కామెరూన్ దేశాల్లో కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఆ దేశాల నుంచి వచ్చే వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఐసోలేషన్‌లో ఉండటం.. లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రిలో చేరాలని సూచించారు.రక్తం, శరీర ద్రవాలు, చర్మ గాయాలు, శ్వాసకోశ స్రావాల ద్వారా ఇతరులకు సోకుతుంది.ఈ లక్షణాలు ఉంటే..

హఠాత్తుగా జ్వరం రావడం తలనొప్పిజి కండరాల నొప్పులు,వెన్నునొప్పిజి కాళ్లు, చేతులు, ముఖంపై దద్దుర్లు, దురద

చలి, తీవ్ర అలసట

# వ్యర్థాల్లో అర్థం.. పరమార్థం




హైదరాబాద్ : హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైన 'ఎకో సస్టైన్ ఎక్స్‌పో'లో వేర్వేరు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రతినిధులు తమ ఆవిష్కరణలు, పేటెంట్ పొందిన నమూనాలను ప్రదర్శించారు. గృహ, వాణిజ్యపరంగా ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు, వ్యర్థజలాలను పునర్వినియోగించేలా రూపొందించిన ప్రోటోటైప్‌లను సందర్శకులకు వివరించారు. ఇందులో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువగా ఉపయోగపడే 'ఫుడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' (చగ్), 'డీసెంట్రలైజ్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

బయోగ్యాస్ తయారీ ఇలా.. కంపోస్ట్ పద్ధతికి భిన్నంగా 'అనెరోబిక్' పద్ధతిలో వ్యర్థాలను ఎరువులు, బయోగ్యాస్‌గా మారుస్తున్నారు. 50 కేజీల ఆహార వ్యర్థాలను వేస్తే 1 కేజీ ఎల్పీజీ గ్యాస్ పరిమాణంతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయొచ్చని చెన్నైకి చెందిన ఎవిర్స్‌టెక్ సంస్థ ప్రతినిధి వి.భరత్ తెలిపారు. ఆహార వ్యర్థాలను 'అనెరోబిక్ డైజెషన్ పద్ధతిలో' తక్కువ సమయంలో ఎరువుగా మారుస్తుంది. ఇంట్లో రోజూ ఉత్పత్తి అయ్యే ఆహార వ్యర్థాలను ఫుడ్ క్రషర్‌లో వేయాలి. అనంతరం దానిని ఫుడ్ వేస్ట్ స్లర్రీ కోసం కేటాయించిన డ్రమ్ములో వేయాలి. దానికి అనుసంధానించిన ఫుడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అది పయనించి చగ్‌పై అమర్చిన రియాక్టర్‌లో బయోగ్యాస్, ఎరువులను తయారు చేస్తుంది. బయోగ్యాస్‌ను తక్కువ ఒత్తిడితో ఇంట్లో వినియోగించుకోవచ్చు. 'బ్లాక్‌గోల్డ్'గా పిలిచే ఎరువును ఇంట్లో గార్డెనింగ్‌కు వినియోగించొచ్చు లేదా విక్రయించొచ్చు. అపార్ట్‌మెంట్ సముదాయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆఫీసు క్యాంటీన్లలో వీటిని పెద్దఎత్తున వినియోగించొచ్చు.

3 కేఎల్‌డీ సామర్థ్యంతో ...

20 నుంచి 30 కుటుంబాలున్న అపార్ట్‌మెంట్లలో వ్యర్థ జలాల నిర్వహణ సరిగా ఉండటం లేదు. వీటికి పరిష్కారంగా కర్ణాటకకు చెందిన ఇన్నోవేటివ్ వాటర్ టెక్నాలజీస్ అంకుర సంస్థ 3 కేఎల్‌డీ సామర్థ్యంతో 'డీసెంట్రలైజ్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్'ను రూపొందించింది. తక్కువ ఖర్చులో వ్యర్థ జలాల నిర్వహణ, పునర్వినియోగించేలా దీనిని రూపొందించింది. రోజూ ఉత్పత్తయ్యే వ్యర్థజలాలను బయోజోన్ ట్యాంక్‌కు అనుసంధానం చేస్తారు. ఏరియేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత శుద్ధి చేసిన జలాలు ట్యూబ్ సెట్లర్ యూనిట్ లోకి వెళ్తాయి. ఇక్కడ రెండోసారి శుద్ధి చేసి డోసింగ్ పంపుల ద్వారా క్లోరినేషన్ చేస్తారు. అనంతరం శాండ్ ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసి పంపుతారు. ఈ నీటిని గార్డెనింగ్ తదితరాలకు వినియోగించొచ్చు. సెట్లింగ్ ట్యాంక్‌లో మిగిలిపోయిన వ్యర్థాలు స్లడ్జ్ ట్యాంక్‌లో ఉండిపోతాయి. వాటిని తీసేయొచ్చు.

# కిడ్నీ బాధితులకు భరోసా



కోరుట్ల: డయాలసిస్ కేంద్రాలు గతంలో కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉంటుండేవి. కిడ్నీ వ్యాధిగ్రస్థులు మూడు రోజులకొకసారి వెళ్లి రక్తం శుద్ధి చేయించుకోవడం తీవ్ర ఖర్చుతో కూడుకొని ఉండేది. ప్రైవేటు ఆసుపత్రిలో ఖర్చుతోపాటు రవాణా వ్యయం భారమయ్యేది. ఆర్థికంగా ఉన్నవాళ్లు మాత్రమే సక్రమంగా చికిత్స చేయించుకునేవారు. నిరుపేదలు తరచూ వెళ్లే వీలుకాకపోవడంతో ప్రాణాలు కోల్పోయేవారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ కేంద్రాన్ని కోరుట్లలో ఏర్పాటు చేయడంతో కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన రోగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. 2016 నుంచి ప్రభుత్వం ఉచిత బస్‌పాస్‌తోపాటు నెలకు రూ.2016 ఆసరా పింఛన్ అందజేస్తోంది.కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 2023 జనవరి 5న డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, డీసీడీసీ కిడ్నీ కేర్ సంయుక్తంగా సేవలు అందించాలని నిర్ణయించారు. ముందుగా 5 రక్తశుద్ధి యంత్రాలను సమకూర్చడంతో ఆసుపత్రి పైఅంతస్తులో ప్రత్యేక విభాగంలో కేంద్రం ఏర్పాటు చేసి ఫిబ్రవరి 5 నుంచి రోగులకు డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇటీవల మరో 5 యంత్రాలను ప్రభుత్వం కేటాయించడంతో మొత్తం 10 యంత్రాల ద్వారా నిత్యం 30 మందికిపైగా రోగులకు రెండు విడతల్లో డయాలసిస్ చేస్తున్నారు.

100 మందికిపైగా చికిత్స

కోరుట్ల డయాలసిస్ కేంద్రంలో మొత్తం 100 మందికిపైగా కిడ్నీ బాధితులు నమోదు చేయించుకున్నారు. రోగులకు వైద్య సేవలందించేందుకు కేంద్రం మేనేజర్, 13 మంది టెక్నీషియన్లు ఉన్నారు. వీరు ఉదయం 5.30 నుంచి రాత్రి 12 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 30 మందికిపైగా రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్కరికి 4 గంటల సమయం పడుతుంది. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి నెఫ్రాలజీ వైద్యులు టెలీమెడిసిన్ ద్వారా ఎప్పటికప్పుడు రోగుల రిపోర్టు ఆధారంగా చికిత్స అందిస్తుంటారు. అత్యవసర సమయంలో ఆసుపత్రిలోని ఇతర వైద్యులు చికిత్స చేస్తుంటారు. ఇప్పటివరకు 10,000లకుపైగా షిఫ్టుల్లో రోగుల రక్తం శుద్ధి చేశారు. ప్రతి రోగికి కొత్త వైద్య పరికరాలను అమర్చి చికిత్స చేస్తుంటారు. ఇక్కడ చికిత్స పొందిన ఆరుగురు కిడ్నీ వ్యాధిగ్రస్థులు కిడ్నీ ట్రాన్స్‌ప్లానింగ్ చేయించుకున్నారు. మరో నలుగురు ట్రాన్స్‌ప్లానింగ్ చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

మాది ఇబ్రహీంపట్న మండలం డబ్బా గ్రామం. నేను హోటల్ నడుపుతుంటాను. ఆరేళ్ల కిందట నా కిడ్నీలు చెడిపోయాయి. అప్పటి నుంచి ఇతర పట్టణాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునే వాడిని. కోరుట్లలో కేంద్రం ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి మూడు రోజులకు ఒకసారి వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాను. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాను.

సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం అందుబాటులో ఉండటంతో నిత్యం కిడ్నీ రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. రోజుకు 30 మందికిపైగా రోగులకు డయాలసిస్ చేస్తున్నాం. 50 మంది వరకు వినియోగించుకునే వీలుంది. నిత్యం వైద్యుల పర్యవేక్షణలో టెక్నీషియన్లు రక్తం శుద్ధి చేస్తుంటారు.– సునీతారాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్


# రుణ మాఫీకి తప్పని పాట్లు

పెద్దపల్లి : ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ రైతులను కలవరపెడుతోంది. సాంకేతిక తప్పిదాలు, ఇతర కారణాలతో అర్హులైన రైతులకు దూరం చేసినట్లయింది. రోజుల తరబడి బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణలు చేస్తున్నారు. రోజు రోజుకూ ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోంది. దీంతో అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అమలు చేసేందుకు రైతు వేదికల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హుల జాబితా రూపొందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

అనేక కారణాలు 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు పొందిన పంటరుణాలకు రూ.2 లక్షల రుణం మాఫీ కానుంది ఒకే రేషన్‌కార్డులో కుటుంబ సభ్యులందరూ కలిపి రూ.2 లక్షలలోపు ఉన్న వారికి మాఫీకాలేదు.రేషన్‌కార్డు లేకపోవడంతో కుటుంబ సభ్యుల నిర్ధారణ కాలేదు.బ్యాంకుఖాతా, ఆధార్ నంబరు సరిపోలకపోవడం, వివరాలు సక్రమంగా నమోదుకాకపోవడం. బ్యాంక్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం.

జిల్లాలో మరో 17 వేల మంది..

జిల్లాలో రుణమాఫీ కావాల్సిన వారు సుమారుగా మరో 17 వేల మంది ఉంటారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరి నుంచి రైతువేదికల్లో అర్జీలు స్వీకరిస్తున్నారు. రైతుల నుంచి తీసుకున్న దరఖాస్తులను ఏవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇప్పటి వరకు మొదటి విడతలో 29,724 మంది రైతులకు రూ.149.42 కోట్లు, రెండో విడతలో 13,401 మంది రైతులకు రూ. 124.40 కోట్లు, మూడో విడతలో రూ.8,268 మంది రైతులకు రూ.101.75 కోట్లు మొత్తం 51,393 మంది రైతులకు రూ. 375.58 కోట్లు మాఫీ అయింది. మరో 17



వేల మందికి రూ.242.85 కోట్లు మాఫీ కావాల్సి ఉంది.

రేషన్‌కార్డు లేదని ఎస్టీపీసీ కేంద్ర సహకార బ్యాంకులో గతేడాది ఆగస్టులో రూ. లక్ష పంట రుణం తీసుకున్నా. మూడు విడతల వరకు ఎదురుచూశా. అధికారులను అడిగితే రేషన్‌కార్డు లేకపోవడంతో రాలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

–అర్జున్, రైతు, పాలకుర్తి

ముగ్గురిలో ఎవరికీ మాఫీకాలేదు

నా భార్య, తండ్రితో కలిసి ముగ్గురి పేరిట వేర్వేరు బ్యాంకుల్లో రూ.2.60 లక్షల రుణం ఉంది. ముందుగా భార్యకు మాఫీ అనిచెప్పారు. ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. ముగ్గురి పేర్లు ఒకే రేషన్‌కార్డులో ఉండటంతో మాఫీ కాలేదని అధికారులు చెబుతున్నారు.

–తిరుపతి, అబ్బాపూర్, జూలపల్లి మండలం

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

జిల్లాలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తాం. అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదించనున్నాం. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయనున్నాం.

–ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

# 8 నెలలవుతుంది.. ఎత్తిపోసేదెన్నడో?

ధర్మపురి: పట్టణ సమీపంలో ఉన్న అక్కపల్లి రిజర్వాయర్ పనులు గత ఎనిమిది నెలలుగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభించిన కొద్ది నెలలకే ఎన్నికల కోడ్ రావడం.. ఈలోగా మళ్లీ డిజైనింగు అనుమతులు రావాల్సి ఉండడంతో ఆగిపోయాయి. గోదావరి జలాలతో ధర్మపురికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రిజర్వాయర్‌లోకి సాగు నీటిని ఎత్తిపోయడం ద్వారా 5,500ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం చేసే లక్ష్యంతో గత ప్రభుత్వం ఈ పనులు ప్రారంభించింది. మిషన్ కాకతీయలో భాగంగా చెరువు అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు కేటాయించగా.. ఇవన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. ఆ తర్వాత గోదావరి ఎత్తిపోతల పథకానికి రూ.60.90 కోట్ల నిధులు విడుదలయ్యాయి. సుమారుగా గోదావరి నుంచి ఒక కిలోమీటరు దూరంలో భారీ మొత్తంలో నీటిని నిలువ చేసే లక్ష్యంతో పెద్ద బావిని తవ్వారు. అయితే డిజైనింగులో సాంకేతిక పరంగా అనుమతులు రావాల్సి ఉంది. దీంతో ఈ పనులన్నీ పెండింగులో ఉండిపోయాయి.

**అధికారులు అనుమతి ఇస్తేనే..** ఈ పథకం బావికి గోదావరి నుంచి అనుసంధానం చేయడం.. ఆ తర్వాత పైపులైను ఏర్పాటుచేసి, అక్కపల్లి చెరువులోకి ఒక సెకన్‌కు 50 క్యూసెక్కుల నీటిని పంపించేలా కాలువలను నిర్మించాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారులు అనుమతి



ఇస్తేనే ప్రారంభమయ్యే అవకాశముం ది. చెరువులో ఎల్లప్పుడూ 0.15 టీఎంసీలు నీటిని నిలువ ఉంచేలా ఎస్సారెస్పీ అధికారులు స్థిరీకరించారు. ఈ పనులు పూర్తయితే ధర్మపురి పట్టణంతోపాటు పలు గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్య తీరనుంది.

**ఏటా ఇబ్బందులే..**

అక్కపల్లి చెరువును రిజర్వాయర్‌గా మార్చినా.. నీటి సౌలభ్యం లేక సాగునీరు అందడం లేదు. దీంతో ధర్మపురితోపాటు, నర్సయ్యపల్లె, కోరండ్లపల్లె, బుద్దేశ్‌పల్లి, తుమ్మెనాల, నాగారం, కమలాపూర్, కొత్తకోరండ్లపల్లె ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడితే చెరువు నిండి.. కొద్ది రోజులకు మత్తడి ద్వారా నీరు ఖాళీ అవుతోంది. ఈ పల్లెల్లో రైతులు వ్యవసాయం మానివేసి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే పుష్కలంగా సాగు నీరందే అవకాశముందని విస్తున్నారు.

**పూర్తయిన పనులు ఇవే..**

గతేడాది అక్కపల్లి చెరువును అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసింది. దీంతో చెరువు చుట్టూ పొడవునా నూతనంగా కట్టను ఆధునికీకరించారు. ఆయకట్టుకు నీరందించేలా కాలువలను రూపొందించారు. గత వేసవిలో చెరువులో నీరు నిలిచేలా పూడిక తీయించారు. మరికొన్ని పనులు పెండింగులో ఉన్నాయి. ఇవి కూడా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం** అక్కపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రీడిజైనింగు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. పనులు పూర్తయితే ధర్మపురి ప్రాంతంలోని బీడు భూములన్నీ సస్యశ్యామలం అవుతాయి. – సాజిద్, ఏఈ, ఎస్సారెస్పీ, ధర్మపురి

# బిల్లులు రావు.. పోషకాలు లేవు!

గోదావరిఖని : 'పిండి కొద్దీ రొట్టె' అన్నారు పెద్దలు.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిస్థితి కూడా అలాగే తయారయింది.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో నిర్వాహకులు ఆహారంలో పోషకాలను పక్కన పెడుతున్నారు.. గోరుచుట్టుపై రోకటి పోటులా నిత్యావసరాల ధరలు మండుతుండటంతో పలుచని చారు.. తక్కువ ధర కూరలతో సరిపుచ్చుతున్నారు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,500 మంది వరకు మధ్యాహ్న భోజన నిర్వాహకులున్నారు. ఒక్కొక్కరికి రూ.60 వేల నుంచి రూ.2 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9, 10 తరగతులకు సంబంధించి గత విద్యా సంవత్సరం చివరి నెల బకాయిలు కూడా ఇంకా రావాల్సి ఉంది. దీంతో అప్పులు తెచ్చి.. అరువులకు సరకులు తీసుకుని భోజనం వండాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. మరోవైపు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. మెనూ ప్రకారం భోజనం చేస్తే ఒక్కో విద్యార్థికి కనీసం రూ.15 ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. తక్కువ విద్యార్థులు ఉ



న్న పాఠశాలల్లో కొంత వరకు ఖర్చు తక్కువగా ఉన్నా, విద్యార్థులు ఎక్కువ ఉన్న పాఠశాలల్లో ఆర్థిక భారమవుతోంది. దీంతో నిర్వాహకులు తక్కువ ధరలో వచ్చే ఆలుగడ్డ ఇతర కూరగాయలతో వంటలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉదయం విద్యార్థులకు రాగి జావ ఇవ్వాలని నిర్ణయించినా అందుకు సంబంధించి నిధులు రాకపోవడంతో నిర్వాహకులు తయారు చేయడం లేదు. దీంతో ఆ పోషకాహారమూ అందడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వర్కర్లు తమకు నెలలుగా వేతనాలు, బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీఈవోలు జనార్దన్‌రావు, మాధవి, జగన్‌మోహన్‌రెడ్డి, రమేశ్‌లు మాత్రం ఎప్పటికప్పుడు బిల్లులు తయారు చేసి ట్రెజరీకి పంపుతున్నామని చెప్పారు. జూన్ వరకు బిల్లులు విడుదలయ్యాయని జులైవి త్వరలో విడుదలవుతాయని చెప్పారు. కాగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు మాత్రం తమకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరైతేనే మెనూ అమలు చేయగలమని, అప్పులు చేసే పరిస్థితి రాదని పేర్కొంటున్నారు.



# డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన రఘురామ

అమరావతి: శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన రఘురామకృష్ణరాజును స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. దీంతో ఆయన డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రఘురామను చంద్రబాబు, పవన్, అయ్యన్నపాత్రుడు అభినందించారు.

అనంతరం తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలు స్పీకర్ స్థానం వద్దకు వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు.



# అసెంబ్లీకి వెళ్లకపోతే వైకాపా ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

అమరావతి : జగన్ అరాచకాలు భరించలేకే ప్రజలు ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా వ్యవహరించి కూటమికి ఓట్లు వేశారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.

అసెంబ్లీకి వెళ్లనప్పుడు వైకాపాకు 38 శాతం ఓట్లు వచ్చినా.. కాంగ్రెస్ పార్టీకి ఒక్క శాతం ఓట్లు వచ్చినా తేడా ఏంటని ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లమనే రెఫరండంతో వైకాపా ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టే వారు క్షమాపణలు చెప్పినా.. వదలకూడదన్నారు. పోస్టులు పెట్టేవారి అరెస్టుల్ని రాజకీయ కోణంలో కాకుండా సామాజిక కోణంలో చూడాలన్నారు



# ఆర్‌ఆర్‌ఆర్‌లా రఘురామకృష్ణరాజు సంచలనాలు సృష్టించాలి

అమరావతి: 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలో నాటు నాటు పాట ఎంత పాపులర్ అయ్యిందో.. రఘురామకృష్ణరాజు రచ్చబండ ప్రోగ్రాం రాజకీయాల్లో అంతే పాపులర్ అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు బాధ్యతలు చేపట్టిన తర్వాత అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా రఘురామకు సీఎం చంద్రబాబు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. తెలుగుబిడ్డగా పంచెకట్టులో వచ్చిన రఘురామ.. స్పీకర్ స్థానానికి నిండుతనం తీసుకొచ్చారని చంద్రబాబు కొనియాడారు. కొత్త బాధ్యతలో రఘురామను చూస్తుంటే సంతోషం కలుగుతోందన్నారు.

**పోరాట యోధుడు రఘురామ..** "ఒకే రోజులో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, అరెస్టు మూడూ జరిగాయి. శుక్రవారం అరెస్టు చేస్తే కోర్టు ఉండదు కాబట్టి జైల్లో పెట్టొచ్చని కుట్ర చేశారు.

పోలీసు కస్టడీలో ఉన్న రఘురామపై దాడి చేయడం దారుణం. లాఠీలు, రబ్బర్ బెల్టులతో అరికాళ్లపై కొట్టారు. కొట్టినట్టు కోర్టులో చెబితే కస్టడీకి వచ్చినప్పుడు చంపేస్తామని బెదిరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పంపి వైద్య పరీక్షలు చేయాలని కోర్టు చెప్పింది. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లకుండా నివేదికను తారుమారు చేసేందుకు యత్నించారు. వైద్యపరీక్షల నివేదిక కోర్టులో సమర్పించేందుకు ఆలస్యం చేశారు. రఘురామను తీసుకురావాలని కోర్టు చెబితే తీసుకెళ్లకుండా మొరాయించారు. చివరికి హైదరాబాద్ మిలిటరీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేశారు. ఆ నాటి సీఎం.. రఘురామకృష్ణరాజును పోలీసులతో కొట్టించి, ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చూసి పైశాచిక ఆనందం పొందారు. రఘురామ ఎంపీగా పనిచేసిన ఐదేళ్లలో నియోజకవర్గానికి రానియ్యకపోతే.. రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరయ్యారు. పోరాట యోధుడిగా గెలిచిన రఘురామను అభినందిస్తున్నా. ఆ నాడు మిమ్మల్ని రాష్ట్రానికి రానీయని వాళ్లు.. నేడు మీ ముందు సభలోకి రాలేని, కూర్చోలేని పరిస్థితి వచ్చింది. ఇది.. దేవుడు రాసిన స్క్రిప్టు" అని చంద్రబాబు అన్నారు.



# గౌతమ్‌రెడ్డిపై రౌడీషీట్ ఎందుకు క్లోజ్ చేశారో తేలుస్తాం

అమరావతి: బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లపై కఠినంగా ముందుకెళ్తున్నట్లు విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.కోట్ల విలువైన స్థలం కొల్లగొట్టేందుకు వైకాపా నేత, ఫైబర్‌నెట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి కిరాయి హత్యకు ప్రణాళిక వేసినట్లు విచారణలో తేలిందన్నారు. గౌతమ్‌రెడ్డిపై హత్య సహా 43 కేసులు నమోదైనట్లు తెలిపారు. అతడిపై గతంలో రౌడీషీట్ నమోదైందని.. అయితే, అది ఎందుకు మూసివేశారో పరిశీలిస్తామని చెప్పారు. గౌతమ్‌రెడ్డిపై నమోదైన కేసులన్నింటిపైనా విచారణ చేస్తామన్నారు. "స్థలం విషయంలో నకిలీ దస్త్రాలతో గౌతమ్‌రెడ్డి మోసగించినట్లు ఫిర్యాదుల వచ్చాయి. ఉమామహేశ్వరశాస్త్రి ఇచ్చిన ఫిర్యాదుపైనా చర్యలు తీసుకుంటున్నాం. ఈ కేసు సంబంధించి ఐదుగురు పరారీలో ఉన్నారు. గాలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. నలుగురు దొరికారు.. అనిల్‌ను పట్టుకోవాల్సి ఉంది. అనిల్‌కు కూడా పృథ్వీరాజ్ నుంచి కాల్స్ ఉన్నాయి. సాంకేతిక ఆధారాలన్నీ సేకరించి విచారణ చేస్తున్నాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఊరుకునేది లేదు. రౌడీలు ఇష్టారాజ్యంగా చేస్తామంటే వదిలే ప్రసక్తే లేదు" అని సీపీ స్పష్టం చేశారు.

**కేసు నేపథ్యమిదీ..** పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సత్యనారాయణపురం శివాలయం వీధికి చెందిన గండూరి ఉమామహేశ్వరశాస్త్రి తల్లి పేరిట లక్ష్మీనగర్‌లో స్థలం కొని, 2014లో రిజిస్టర్ చేశారు. తమ స్థలాన్ని గౌతమ్‌రెడ్డి ఫోర్జరీ పత్రాలతో కబ్జా చేశారని ఉమామహేశ్వరశాస్త్రి ఆరోపిస్తున్నారు. ఈ స్థలంపై వీరిద్దరి మధ్య ఏడేళ్లుగా వివాదం నడుస్తోంది. గౌతమ్‌రెడ్డి విజయవాడ కార్పొరేషన్ అనుమతి తెచ్చి ఈ స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తులు నిర్మించారు. 2017లో శాస్త్రి ఫిర్యాదు మేరకు సత్యనారాయణపురం ఠాణాలో గౌతమ్‌రెడ్డిపై కేసు పెట్టారు. ఆయన హైకోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారు. కబ్జా, అక్రమ నిర్మాణంపై శాస్త్రి ఎడతెగని న్యాయ పోరాటం చేశారు. చివరకు రెండో అంతస్తు కూల్చేందుకు అధికారులు ఉపక్రమించగా.. వైకాపా నేత హైకోర్టుకు వెళ్లి 4 వారాల వరకు యథాతథ స్థితి ఆదేశాలు తెచ్చుకున్నారు. ఈ స్థలం విలువ దాదాపు రూ.10 కోట్లని అంచనా.

# శాసనసభ సాక్షిగా నా తల్లిని అవమానించారు: మండలిలో మంత్రి లోకేశ్ ఫైర్



అమరావతి: గతంలో శాసనసభ సాక్షిగా తన తల్లిని వైకాపా సభ్యులు అవమానించారని మంత్రి లోకేశ్ అన్నారు. బడ్జెట్ సమావేశాల మూడో రోజు ఆయన శాసనమండలిలో మాట్లాడారు.

సీఎం చంద్రబాబును ఉద్దేశించి వైకాపా సభ్యులు చేసిన వ్యాఖ్యలపై లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చంద్రబాబు సభకు వచ్చారు. సింహంలా సింగిల్‌గా నిలబడ్డారు. శాసనసభ సాక్షిగా నా తల్లిని అవమానించిన తర్వాతే.. ఆవేదనతో ఆయన ప్రతిజ్ఞ చేసి వెళ్లిపోయారు. తెదేపా నేతలపై మళ్లీ ఇవాళ అసభ్యకర పోస్టులు చేస్తున్నారు. మాట్లాడాలను కుంటే మేమూ మాట్లాడగలం. ఏనాడూ జగన్ కుటుంబం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆ రోజు నా తల్లిని అవమానించింది మీకు గుర్తుకు రాలేదా? అప్పుడు అన్ని మాట్లాడిన జగన్ ఇప్పుడు సభకు ఎందుకు రావడం లేదు. నా తల్లిని అవమానించిన వారికి ఎన్నికల్లో టికెట్లు ఎలా ఇచ్చారు" అని లోకేశ్ నిలదీశారు.

# విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నోటిఫికేషన్ రద్దు




దిల్లీ: విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం రద్దు చేసింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ఈ మేరకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై మండలి ఛైర్మన్ అనర్హత వేటు వేశారు. మండలి ఛైర్మన్ నిర్ణయాన్ని రఘురాజు హైకోర్టులో సవాల్ చేశారు. మండలి ఛైర్మన్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ఉన్నత న్యాయస్థానం.. అనర్హత వేటు చెల్లదని తీర్పు ఇచ్చింది. అతను ఎమ్మెల్సీగా కొనసాగొచ్చని తీర్పు ఇచ్చింది. దీంతో ఉపఎన్నిక నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు ఈసీ ప్రకటించింది.

# ఉపాధి కల్పన ఆధారంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు: మంత్రి టీజీ భరత్



అమరావతి: 2024-29 మధ్య కాలంలో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఏపీ పారిశ్రామికాభివృద్ధి పాలసీ 4.0ను టీజీ భరత్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన సభలో మాట్లాడారు. "జగన్ పాలన కారణంగా పారిశ్రామికవేత్తలు ఏపీని ఉత్తర కొరియాతో పోల్చారు. అధికారంలోకి వస్తూనే పీపీఏలను రద్దు చేయటం వల్ల ఏపీకి వచ్చిన అపప్రద ఇది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో ఏపీ సానుకూలతల గురించి వివరించా. గతంలో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన చంద్రబాబు మళ్లీ ఏపీలో అధికారంలో ఉన్నారని తెలియజేశా. ప్రత్యేకించి రూ.83వేల కోట్ల విదేశీ పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 5 లక్షల ఉద్యోగాలతో పాటు, 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయబోతున్నాం. ఏరోస్పేస్, ఈవీలు, బయోటెక్నాలజీ, పునరుద్పాదక విద్యుత్, సెమీకండక్టర్ పరిశ్రమలు ఏపీకి తీసుకొచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. పోర్టులకు దగ్గరగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రవాణా వ్యయం తగ్గుతుంది. అందుకే అక్కడ ప్రత్యేక కారిడార్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంగా మార్చుకున్నాం. ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేయడం కూడా ఈ పాలసీ లక్ష్యం. నాలుగు కేటగిరీలుగా పరిశ్రమల్ని వర్గీకరించి ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించాం. ఉపాధి కల్పన ఆధారంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కర్బన రహిత పరిశ్రమలకు, తొలుత ఏర్పాటు చేసే 200 పరిశ్రమలకు కూడా ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయి" అని మంత్రి వివరించారు.

# రాజకీయాల్లో నేరస్థులకు స్థానం ఉండకూడదు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



"నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో మిమ్మల్ని అడుగు పెట్టనివ్వమని ఛాలెంజ్ చేసిన వాళ్లే ఈ రోజు మీ ముందు సభలో అడుగు పెట్టలేకపోయారు. కర్మ అంత బలంగా ఉంటుంది" అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన రఘురామకృష్ణరాజుకు పవన్ అభినందనలు తెలిపారు. ఆయన పోరాట పటిమను కొనియాడారు. "ఉండి నియోజకవర్గం నుంచి 56వేల పైచిలుకు ఓట్లతో గెలిచి మీరు అసెంబ్లీకి వచ్చారు. గత ప్రభుత్వం రాజకీయాలను నేరమయం చేసింది. నేరస్థులు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో మొన్నటి వరకూ చూశాం. గత ప్రభుత్వంలో అందరూ ఏదో రకంగా ఇబ్బందులు పడ్డారు. రాజకీయాల్లో నేరస్థులకు స్థానం ఉండకూడదు. దురదృష్టవశాత్తూ 2019లో నేరస్థులు అధికారంలోకి వచ్చారు" అని పవన్ అన్నారు.

# జగన్‌ను జీవితాంతం జైలులో ఉంచినా తప్పులేదు: విష్ణుకుమార్‌రాజు

అమరావతి: రుషికొండ ప్యాలెస్‌లో విలాస వస్తువులు చూస్తే.. ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందేనని భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు అన్నారు. ప్రజాధనం దుర్వినియోగం తీరు చూస్తే ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. గురువారం అసెంబ్లీలో రుషికొండ ప్యాలెస్‌పై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "తలుపుల కోసం రూ.31 లక్షలు, బాత్‌రూమ్‌లో కమోడ్ కోసం రూ.11 లక్షలు వినియోగించారు. రుషికొండ ప్యాలెస్‌లో వాడినంత ఖరీదైన ఫర్నిచర్ నేనెక్కడా చూడలేదు" అని విష్ణుకుమార్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. రుషికొండపై అధికార దుర్వినియోగానికి జగన్‌ను జీవితాంతం జైలులో ఉంచినా తప్పులేదని వ్యాఖ్యానించారు.

పర్యాటక భవనాల ముసుగులో నిర్మాణాలు అతిపెద్ద ఆర్థిక కుంభకోణమన్నారు. తెదేపా ఎమ్మెల్యే రఘురామ మాట్లాడుతూ రుషికొండ నిర్మాణాలను జగన్ కట్టుకున్న రాజకీయ సమాధిగా పరిగణించాలన్నారు. ఆ నిర్మాణాలను కూల్చివేయకుండా నియంత కట్టుకున్న విలాస భవనాలు ఇవి అని ప్రజలకు తెలిసేలా వారిని సందర్శనకు అనుమతించాలని ప్రభుత్వానికి సూచించారు.

# అసభ్యకర పోస్టులు.. సినీనటి శ్రీరెడ్డిపై మరో కేసు నమోదు



అమరావతి: సినీనటి శ్రీరెడ్డిపై కృష్ణా జిల్లా గుడివాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితలపై అసభ్యకర రీతిలో పోస్టులు పెట్టారంటూ మచిలీపట్నం తెదేపా సోషల్ మీడియా కన్వీనర్ నిర్మల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గుడివాడ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి.. అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, అనితలపై ఆమె ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ.. సీఐకి ఫిర్యాదు పత్రం అందజేశారు. ఇప్పటికే శ్రీరెడ్డిపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గ్రామీణంలో కేసు నమోదైన సంగతి తెలిసిందే.

**పోసాని కేసులు నమోదు :** సీఎం చంద్రబాబు, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడుపై సినీనటుడు పోసాని కృష్ణమురళి అసభ్యకర పోస్టులు పెట్టినట్లు గురువారం తెదేపా నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సత్తెనపల్లి, వినుకొండ, నరసరావుపేట పోలీస్ స్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి.

# ఢిల్లీకి సీఎం చంద్రబాబు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన ఖరారు అయింది. శుక్రవారం మధ్యాహ్నం 1.00 గంటకు సీఎం చంద్రబాబు ఢిల్లీ బయలు దేరి వెళ్లనున్నారు. అందుకోసం వెలగపూడిలోని సచివాలయం ఎదురుగా ఉన్న హెలి ప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి వెళ్లనున్నారు. సాయంత్రం 3:45 గంటలకు సీఎం చంద్రబాబు ఢిల్లీ చేరుకుంటారు. ఈ ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో ఆయన భేటీ కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో ఆయన చర్చించనున్నారు. అలాగే ఢిల్లీలోని బీజేపీ పెద్దలతో సైతం ఆయన సమావేశం కానున్నారు. ఇక శనివారం ఢిల్లీ నుంచి మహారాష్ట్రకు సీఎం చంద్రబాబు బయలుదేరి వెళ్లనున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు. ఎన్డీయే తరఫున ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మహారాష్ట్రలో ఎలాగైనా అధికారాన్ని నిలుపుకోవాలని మహాయుతీ కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. దీంతో బీజేపీ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్ష పార్టీల అధినేతలు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ.. సూడిగాలి ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సైతం మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో మహాయుతీని చావు దెబ్బ కొట్టాలంటూ మహా వికాస్ అఘాడీ భాగస్వామ్య పక్షాలు తమదైన శైలిలో ముందుకు వెళ్తున్నాయి. ఇక మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 20వ తేదీన జరగనున్నాయి. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్రలో రెండు కూటముల మధ్య రసవత్తర పోరు జరుగుతుంది. ఎన్సీపీ (శరద్ పవార్), శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), కాంగ్రెస్ పార్టీలు కలగలిసి మహా వికాస్ అఘాడీగా ఏర్పాటయ్యాయి. అలాగే ఎన్సీపీ (అజిత్ పవార్), శివసేన (షిండే), బీజేపీ కలిసి మహాయుతీగా అవతరించింది. దీంతో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటరు పట్టం కడతాడనేది నవంబర్ 23వ తేదీన తెలిపోనుంది.

## కీర్తి సురేష్.. బీటౌన్ లో మాజిక్ క్లిక్కయ్యేనా?

కీర్తి సురేష్ తన గ్లామర్‌తో పాటు టాలెంట్‌తో ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈమె తన మొదటి బాలీవుడ్ చిత్రమైన బేబీ జాన్ తో బాలీవుడ్ లో అడుగుపెడుతోంది. ఈ సినిమాలో ఆమె నటిస్తున్న లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యంగా బ్లాక్ శారీలో కీర్తి సురేష్ అందంగా కనిపిస్తూ, అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది. కోలీవుడ్ థెరి సినిమాకు ఇది రీమేక్. మొదట తన సినీ ప్రస్థానాన్ని తెలుగులో ప్రారంభించిన కీర్తి సురేష్, ఫాస్ట్ గానే స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదిగింది. నేను శైలజ వంటి హిట్ సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తరువాత వచ్చిన మహానటి చిత్రం కీర్తి కెరీర్ లో మైలురాయిగా నిలిచింది. అందులో సావిత్రి పాత్రలో అద్భుత నటనతో ఆకట్టుకోవడంతో, ఆమెకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఈ పాత్రకుగాను కీర్తి సురేష్ కి నేషనల్ అవార్డు లభించడం



విశేషం. ఇప్పటి వరకు దక్షిణాది భాషల్లో మాత్రమే పరిమితమైన కీర్తి సురేష్, ఇప్పుడు బాలీవుడ్ కి ప్రయాణం చేస్తోంది. బేబీ జాన్ చిత్రంలో వరుణ్ ధావన్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. బాలీవుడ్ ప్రేక్షకులకు తన నటనతో పాటు తన అందం కూడా పరిచయం చేయడానికి ఆమె చాలా ఉత్సాహంగా ఉంది. ఈ సినిమాలో ఆమె పాత్ర చాలా ఇంటెన్స్ గా ఉండనుందని సమాచారం. కీర్తి సురేష్ కెరీర్ లో ఇటీవల సర్కారు వారి పాట, దసరా లాంటి సినిమాలు బాక్సాఫీస్ వద్ద గట్టిగానే హైలెట్ అయ్యాయి. అయితే ఈ చిత్రాల ద్వారా కీర్తి తన నటనతో పాటు ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ లో కూడా తన ప్రత్యేకతను చాటుకుంది. ఆమె అద్భుతమైన నటనతో ప్రతి పాత్రలో కొత్తదనం చూపిస్తూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటుంది. ప్రస్తుతం కీర్తి సురేష్ నార్త్ మరియు సౌత్ ఇండస్ట్రీల్లో బ్యాలెన్స్ చేస్తూ, రెండు భాషల్లో కూడ తన క్రేజ్ ను కొనసాగిస్తోంది. బాలీవుడ్ లో తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకోవాలని ఆమె ఆశపడుతుంది. ఈ ఫోటో ద్వారా ప్రేక్షకులు ఆమెపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతున్నాయి. బేబీ జాన్ సినిమా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. మరి అమ్మడు అక్కడ స్టార్ హీరోయిన్స్ తో ఎలాంటి పోటీని ఎదుర్కొంటుందో చూడాలి.

## క్యూట్ లుక్ లో కాక పుట్టించేలా!

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హాట్ అప్పిరియన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు బాలీవుడ్ కి వెళ్లిన నాటి నుంచి తన లో కొత్త యాంగిల్ ని బయటకు తీసింది. అక్కడ కల్చర్ కి తగ్గట్టు మూవ్ అవుతుంది. నార్త్ భామల నుంచి పోటీని తట్టుకుని మార్కెట్ లో నిలబడాలంటే ఆమాత్రం తప్పనిసరి. అలా చేయగల్గింది కాబట్టి నేడు సల్మాన్ ఖాన్ తో ఛాన్స్ అందుకుంది. స్టార్స్ చిత్రాల్లో భాగమవుతుంది. అప్పటి నుంచి సోషల్ మీడియా యాక్టివిటీని మరింత స్పీడప్ చేసింది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో ట్రెండ్ కి తెర తీస్తుంది. తాజాగా అమ్మడు క్యూట్ లుక్ ఫోటోలు కొన్ని షేర్ చేసింది. జర్నీ చేస్తూ క్యాబిన్ నుంచి ఫోటోలు పంచుకుంది. ఇందులో అమ్మడు తన మార్క్ చేష్టలతో అలరించింది. రెండు చేతుల వేళ్లను కలిపి లవ్



సింబల్ చేసింది. ముఖం నుంచి రకరకాల హావభావాలు ఒలికించింది. పెదాలకు లిప్ స్టిక్ తప్ప పెద్దగా మ్యాకప్ వేసుకోలేదు. నేచురల్ బ్యూటీతోనే కనిపిస్తుంది. అమ్మడు పాల నురుగుల సౌందర్యంతో తళతళలాడిపోతుంది. ఫోటోలన్ని క్యూట్ గా ఉన్నాయి. ప్రస్తుతం ఈ పిక్స్ అంతర్జాలంలో వైరల్ గా మారాయి. దీంతో కామెంట్ బాక్స్ లో పోస్టులు అంతే ఇంట్రెస్టింగ్. ఎవరి స్టైల్లో వారు ప్రపోజ్ చేస్తున్నారు. ఇక రష్మిక డిసెంబర్ లో %-%పుష్ప-2%-% తో రచ్చ చేయడానికి రెడీ అవుతుంది. రిలీజ్ కి కోసం తాను కూడా ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తుంది. ఈ సినిమా ప్రచారం ప్రారంభమైతన తర్వాత రష్మిక ఎలాంటి టెక్నిక్ లతో ఎంగేజ్ చేస్తుందని ఓ సెక్షన్ ఆడియన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




## సూపర్ స్టార్ వెయ్యి కోట్ల ప్రాజెక్ట్ డేట్ ఫిక్స్




తమిళ్ సూపర్ స్టార్ రజనీకాంత్ ఇటీవలే వేట్టయాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమాకు యావరేజ్ టాక్ వచ్చినా బాక్సాఫీస్ వద్ద దాదాపుగా రూ.400 కోట్ల వసూళ్లు నమోదు అయ్యాయి. తెలుగు, హిందీ భాషల్లో మంచి వసూళ్లు నమోదు అయ్యి ఉంటే రికార్డులు బ్రేక్ అయ్యి ఉండేవి. వేట్టయాన్ తో బ్రేక్ చేయలేక పోయిన రికార్డులను కూలీ సినిమాతో రజనీకాంత్ బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోకేష్ కనగరాజ్ తన ప్రతి సినిమాతో తన రికార్డ్‌ను తానే బ్రేక్ చేస్తున్న కారణంగా కూలీ సినిమా సరికొత్త వసూళ్ల రికార్డులు క్రియేట్ చేసే అవకాశాలు ఉన్నాయి. లోకేష్ కనగరాజ్ సినిమాకు పాన్ ఇండియా స్థాయిలో ఫ్యాన్స్ ఉన్నారు. ఆయన దర్శకత్వంలో సినిమా అంటే మినిమం ఉంటుందని ఎదురు చూసే వారు చాలా మంది ఉన్నారు. కనుక పాన్ ఇండియా రేంజ్‌లో కూలీ సినిమాకు మంచి స్పందన దక్కే అవకాశాలు ఉన్నాయి. రజనీకాంత్ గత చిత్రాల ఫలితాలతో సంబంధం లేకుండా కూలీ సినిమాను భారీ మొత్తాలకు బయ్యర్లు కొనుగోలు చేసేందుకు రెడీ అవుతున్నారు. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్న 'కూలీ' సినిమాను వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తమిళ మీడియా వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం 2025, మే 1న 'కూలీ' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. వరుస సెలవులు కలిసి రావడంతో పాటు మేడే కానుకగా కూలీ వస్తే బాగుంటుంది అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేశారట. అందుకే లోకేష్ కనగరాజ్ ఈ నిర్ణయం తీసుకుని ఉంటాడని సమాచారం అందుతోంది. లోకేష్ ప్రస్తుతం కూలీ సినిమా షూటింగ్‌ను ముగించే పనిలో ఉన్నాడు. రజనీకాంత్ ఆరోగ్యం సహకరించి ఉంటే ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసి వచ్చే ఏడాది సమ్మర్‌లోనే సినిమా విడుదల చేసి ఉండేవారు. ఇప్పటి వరకు కోలీవుడ్ నుంచి రూ.1000 కోట్ల సినిమా రాలేదు. కంగువా ఆ మార్క్‌ను చేరుకుంటుందని నమ్మకంగా మేకర్స్ ఉన్నారు. ఒక వేళ కంగువా ఆ మార్క్‌ను చేరుకోలేక పోతే కూలీ సినిమా మొదటి వెయ్యి కోట్ల సినిమాగా నిలిచే అవకాశాలు ఉన్నాయని తమిళ మీడియా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రజనీకాంత్ కి మాత్రమే వెయ్యి కోట్ల మార్కెట్ ఉందని, ఆయనకి మాత్రమే ఆ స్టామినా ఉందంటూ ఆయన అభిమానులు మాట్లాడుకుంటూ ఉన్నారు. రజనీకాంత్ కూలీ సినిమాలో శృతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తూ ఉండగా నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్ ఇంకా ప్రముఖ నటీనటులు కనిపించబోతున్నారు.

## అప్పుడలా..ఇప్పుడిలా....డిసెంబర్ ఇలా!



సంక్రాంతి రిలీజ్ లు అనంతరం సరైన రిలీజ్ లు లేక థియేటర్లు ఎలా వెల వెల బోయాయో తెలిసిందే. సమ్మర్ అయితే ఏకంగా థియేటర్లనీ తాత్కాలికింగా మూసి వేయాల్సి వచ్చింది. నిర్మాతలొచ్చి మా సినిమా ల కోసం తెరవండి అని చెప్పే వరకూ కూడా థియేటర్లు తెరుచుకున్న పరిస్థితి లేదు. హనుమాన్', 'డీజే టిల్లు, కల్కి 2898, కమిటీ కుర్రాళ్లు, ఆయ్, సరిపోదా శనివారం, మత్తు వదలరా-2 లాంటి హిట్ సినిమాలు మాత్రమే ఉన్నాయి. ఇవన్నీ ఒకేసారి రిలీజ్ అయినవి కాదు. ఈ తొమ్మిది నెలల కాలంలో ఒక్కో ఫేజ్ లో ఒక్కో చిత్రం చొప్పున రిలీజ్ అయ్యాయి. అలా కాస్తా కూస్తో థియేటర్లు ఆ రిలీజ్ లు కారణంగా కళకళలాడాయి. మళ్లీ ఇప్పుడు దేవర, సత్యం సుందరం లాంటి హిట్ సినిమాల కారణంగా థియేటర్లు కళకళలాడుతున్నాయి. అన్నింటిని మించి ఎన్టీఆర్ దేవర,కల్కి 2898 లాంటి రిలీజ్ లతో థియేటర్లకు కళ తోడైనట్లు ఉంది. చిన్న సినిమాలు హిట్ టాక్ తెచ్చుకున్నా? అవి ఏదో రూపంలో పైరసీ అవ్వడంతో? వాటికి ఆదరణ తగ్గుతుంది. వాటి కోసం జనాలు థియేటర్ వైపుకు మళ్లకపోవడం అది ప్రధాన కారణంగా చెప్పొచ్చు. తాజాగా ఇప్పుడు ఇద్దరు అగ్ర హీరోలు రిలీజ్ కి రెడీ అవుతున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తోన్న పుష్ప-2 డిసెంబర్ 6న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. ఇక మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న గేమ్ ఛేంజర్ కూడా డిసెంబర్ 20న రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాల మధ్య కాస్త పోటీ ఉండొచ్చు. రెండు వారాలు గ్యాప్ ఉన్నా? ఇద్దరు అగ్ర హీరోలు కాబట్టి కొంత పోటీ ఉంటుంది. వసూళ్ల పరంగా కొంత వ్యత్యాసం ఉంటుంది.

## నయన్ కిల్లర్ ఫోజ్ వైరల్

అందాల కథానాయిక నయనతార ఏం చేసినా అది ప్రత్యేకంగా ఉంటుంది. నటిగా పెద్ద తెరపై మెరుపులు మెరిపించడంలోనే కాదు.. వృత్తిగత జీవితంతో ముడిపెట్టకుండా వ్యక్తిగత జీవితాన్ని ఆనందమయంగా తీర్చిదిద్దుకోవడంలోను విజయవంతమైంది. విఘ్నేష్ శివన్.. సరోగసీ కిడ్స్ తో నయన్ ఎంతో ఆనందంగా కాలాన్ని గడుపుతోంది. నయన్ ఏం చేసినా అందుకు సంబంధించిన ఫోటోలు వీడియోలను సోషల్ మీడియాల్లో షేర్ చేస్తుంటుంది. అవన్నీ వైరల్ గా మారుతూనే ఉన్నాయి. తాజాగా నయన్ ఓ స్పెషల్ ఫోటోషూట్ ని ఇంటర్నెట్ లో షేర్ చేసింది. ఈ ఫోటోగ్రాఫ్స్ లో నయనతార ఎంతో నేచురల్ గా అందంగా




కనిపిస్తోంది. ముఖ్యంగా ఎంపిక చేసుకున్న దుస్తులు, ఎక్స్ ప్రెషన్స్, ఫోటోగ్రఫీ థీమ్ ప్రతిదీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా నయనతార అందాల్ని ఎలివేట్ చేసేలా క్లిక్ చేసిన స్పెషల్ స్నాప్ సినీసెలబ్స్ లో ఆసక్తిని కలిగిస్తుంది. నయన్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. కుముద ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. మన్నాగట్టి, డియర్ స్టూడెంట్స్ (మలయాళం), తని ఒరువన్ 2, మూకుతి అమ్మన్ 2 వంటి చిత్రాలలో నటిస్తోంది.

జయం రవి సరసన నటించాల్సిన తని ఒరువన్ 2 చాలా ఆలస్యమైన సంగతి తెలిసిందే. తదుపరి అప్ డేట్ గురించి అంతా ఆసక్తిగా వేచి చూస్తున్నారు. బ్లాక్ బస్టర్ మూవీ తని ఒరువన్ 2 చిత్రీకరణ అంతకంతకు ఆలస్యమవుతోంది.

## మాల్దీవ్స్‌లో 'పారి'జాతం

పారి అలియాస్ పరిణీతి చోప్రా రాజకీయ నాయకుడు రాఘవ్ చద్దాను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత ఈ జంట గోల్స్ ఇతరుల్లో స్ఫూర్తిని నింపుతున్నాయి. నిరంతరం ఒకరితో ఒకరుగా ప్రేమైక ఆనందంలో ఉన్న ఫోటోలు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి. తాజాగా మాల్దీవుల నుంచి స్పెషల్ ఫోటో ఆల్బమ్ విడుదలైంది. పరిణీతి చోప్రా- రాఘవ్ చద్దా తమ మొదటి వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి మాల్దీవులకు వెళ్లారు. మంగళవారం పరిణీతి తమ వెకేషన్ నుండి రాఘవ్ పాస్‌పోర్ట్ ఫ్లెక్స్, సుందరమైన ప్రదేశాలను షేర్ చేసింది. అందమైన రిసార్ట్, అందమైన అబ్బాయి.. నేను... అద్భుతమైన 48 గంటల వేకే కోసం జోయాలీకి ధన్యవాదాలు! అని రాసింది పరిణీతి. బీచ్‌లో సూర్యుడి ఎండలో... సైకిళ్లు తొక్కుతూ ... మిర్రర్ సెల్ఫీ లతో ఒకటే సందడి చేసారు ఇద్దరూ. పరిణీతి తన రిసార్ట్‌లో ఆస్వాదించిన రుచికరమైన ఆహారాన్ని.. మసాజ్ రూమ్ నుండి దృశ్యాన్ని కూడా ఫోటోలు వీడియోలతో డాక్యుమెంట్ చేసింది. పరిణీతి షేర్ చేసిన ఫోటోలలో పారితో పాటు



రాఘవ్ పాస్‌పోర్ట్ ఉంది. పారీ భారతీయులందరిలాగే సాధారణ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండగా.. రాజ్యసభ ఎంపీ అయిన రాఘవ్‌కి దౌత్య పరమైన పాస్‌పోర్ట్ ఉంది. అటువంటి పాస్‌పోర్ట్‌లు దౌత్య హోదా కలిగిన వ్యక్తులకు లేదా విదేశాలలో అధికారిక విధుల కోసం భారత ప్రభుత్వంచే నియమితులవుతారు. ఇది విదేశాల్లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ప్రభుత్వ అధికారులకు వేగవంతమైన ప్రయాణం, దౌత్యపరమైన శక్తి , వీసా ప్రయోజనాలను కలిగి ఉండవచ్చు.

**మొదటి వార్షికోత్సవం :** పరిణీతి- రాఘవ్ తమ మొదటి వివాహ వార్షికోత్సవాన్ని మాల్దీవులలోని తెల్లటి ఇసుక బీచ్‌లు నీలం సముద్రం మధ్య ప్రశాంతమైన వెకేషన్ ని ఆనందించారు. అంతకుముందు ద్వీప దేశంలో ఈ జంట బీచ్ ఒడ్డున కూర్చుని పానీయాలు ఆస్వాధిస్తున్న ఫోటోని, సూర్యాస్తమయాన్ని ఆస్వాధించిన మరొక ఫోటోని షేర్ చేసారు. గత సంవత్సరం సెప్టెంబర్ 24 న పరిణీతి చోప్రా- రాఘవ్ చద్దా ఉదయపూర్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. ఈ వేడుక లీలా ప్యాలెస్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.



# దేశానికే తెలంగాణ రోల్‌మోడల్ కాబోతోంది

హైదరాబాద్: అధికారం కోల్పోయినప్పుడల్లా భారాస నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ప్రభుత్వ వైఫల్యం ఏంటో కేటీఆర్ చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో భట్టి మాట్లాడారు.

"నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ వైఫల్యమా? రైతు రుణమాఫీ చేయడం వైఫల్యమా? ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టడం ప్రభుత్వ వైఫల్యమా? ఫార్మా క్లస్టర్స్ విస్తరణను వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని. కక్ష పూరిత రాజకీయాలకు మేం వ్యతిరేకం. ప్రతిపక్షంగా భారాస తన పాత్ర పోషించిందా? ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడంపైనే ఆ పార్టీ దృష్టి పెట్టింది. కులగణన చేస్తామని మాట ఇచ్చాం. దాని ప్రకారం చేసి చూపిస్తున్నాం. ఇది విప్లవాత్మక నిర్ణయం.. రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుంది. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకునే ప్రశ్నలు తయారు చేశాం" అని భట్టి విక్రమార్క అన్నారు.



# అమెరికాతో సంబంధాలు మరింత మెరుగు

దిల్లీ: ట్రంప్ హయాంలో అమెరికాతో భారత్ సంబంధాలు మరింత మెరుగుపడనున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్ మధ్య ఉన్న సాన్నిహిత్యమే అందుకు కారణమన్నారు. ఈమేరకు సీఎన్‌బీసీ టీవీ-18 నిర్వహించిన గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. గతంలో ఒబామా, తర్వాత బైడెన్ ప్రభుత్వంతోనూ కలిసి పనిచేశామని, ఇరు దేశాల మధ్య బంధం ఎప్పటికప్పుడు బలోపేతం అవుతూ వస్తోందన్నారు. ట్రంప్ ప్రభుత్వంతో ఈ బంధం మరింత బలోపేతం కానుందని పీయూష్ అన్నారు. ప్రధాని మోదీని 'అద్భుతమైన వ్యక్తి', 'డియర్ ఫ్రెండ్' అని ట్రంప్ సంబోంధించడాన్ని ఈసందర్భంగా ప్రస్తావించారు. ప్రధాని మోదీ దేశీయంగానే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా నేతలు, వ్యాపారవేత్తల నమ్మకాన్ని చూరగొన్నారని పీయూష్ అన్నారు. ఆయన నిష్కళ్మషంగా, నిజాయతీగా తన పని తాను చేసుకుంటూ వెళుతున్నానని చెప్పారు.

గత పదేళ్లలో దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా పాపులర్ లీడర్‌గా అవతరించారని పేర్కొన్నారు. ట్రంప్ విజయంలో కీలక భూమిక పోషించిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామికి ట్రంప్ కీలక బాధ్యతలను కట్టబెట్టడంపై సంతోషం వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాలనా వ్యవహారాల మెరుగుకు వారు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. మస్క్‌కు పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో టెస్లా ప్రస్తావన రాగా.. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీని స్వాగతిస్తున్నామని పీయూష్ చెప్పారు. నిర్ణయం మస్క్‌దేనని పేర్కొన్నారు.

**రేట్లు తగ్గించండి:** దేశంలో వినియోగాన్ని పెంచేందుకు రేట్లు తగ్గించాలని పరిశ్రమ, వ్యాపారవర్గాలను పీయూష్ గోయల్ ఈసందర్భంగా కోరారు. తద్వారా మార్కెట్‌లో డిమాండ్ పెంచవచ్చని చెప్పారు. ఇటీవల వెలువడిన త్రైమాసిక ఫలితాలను పరిశీలించినప్పుడు ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల విక్రయాలు తగ్గినట్లు వెల్లడైంది. ఈనేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అలాగే, వృద్ధిని పెంచేందుకు ఆర్‌బీఐ సైతం కీలక రేట్లను తగ్గించాలని కోరగా.. ఇదే సదస్సులో పాల్గొన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వచ్చే నెలలో జరిగే ఎంపీసీ భేటీ వరకు దీనిపై ఏమీ మాట్లాడదలుచుకోలేదంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చారు.

# ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థుల వయోపరిమితి తగ్గించాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థుల వయోపరిమితి తగ్గించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఎన్‌సీఈఆర్‌టీలో విద్యార్థులు నిర్వహించిన అండర్-18 మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. "ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయాలంటే 25 ఏళ్లు నిండాలనే నిబంధన ఉంది. ఓటు హక్కు పొందేందుకు వయోపరిమితి 21 సంవత్సరాల నుంచి 18ఏళ్లకు తగ్గించారు. కానీ, ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయడానికి 25 ఏళ్ల వయసు ఉండాలనే నిబంధనను మాత్రం సవరించలేదు. ఈ నిబంధన ను కూడా సవరించుకుని .. 21 ఏళ్లు నిండిన వారు శాసనసభకు పోటీ చేసే అవకాశం కల్పిస్తూ చట్ట సవరణ చేయాలి. తద్వారా యువత చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం ఉంటుంది. 21 ఏళ్లు నిండిన వారు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా పనిచేస్తున్నప్పుడు... 21 ఏళ్లు నిండిన వారు శాసనసభ్యులుగా కూడా రాణిస్తారని బలంగా నమ్ముతున్నా. మాక్ అసెంబ్లీ తీర్మానాల్లో ఈ అంశాన్ని కూడా చేర్చి రాష్ట్రపతి, ప్రధానమంత్రికి పంపించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా" అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు: చిరుమర్తి లింగయ్య



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భారాస నేత, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విచారణకు హాజరయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పినట్లు తెలిపారు.

"ఈనెల 9న నాకు నోటీసులు ఇచ్చారు. చిన్న విషయాన్నీ పెద్దగా చూస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదు. కేసులో ఇద్దరు వ్యక్తుల నంబర్లు కావాలన్నారు. ప్రచార సమయంలో అదనపు ఎస్పీ (సస్పెండెడ్) తిరుపతన్నతో మాట్లాడిన మాట వాస్తవం. మదన్‌రెడ్డి, రాజు నంబర్లు అడిగారు.. నేను బిజీగా ఉండటం వల్ల నా పక్కన ఉన్నవాళ్లు మెసేజ్ పెట్టారు. అంతేకానీ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు. పోలీసులు వాళ్ల దగ్గర ఉన్న ఆధారాలతో నన్ను పిలిచి విచారించారు.. నేను సమాధానం చెప్పాను. విచారణకు ఎప్పుడు పిలిచినా వస్తాను." అని చిరుమర్తి లింగయ్య అన్నారు.



# రేవంత్.. కుట్రలకు ఎవరూ భయపడరు

హైదరాబాద్: 'ఏదో ఒక కేసులో ఇరికించి నన్ను అరెస్టు చేస్తారని ఎప్పుడో తెలుసు' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. రైతుల గొంతుకైనందుకు అరెస్ట్ చేస్తే గర్వంగా జైలు కెళ్తానన్నారు. 'కుట్రలకు భయపడేవాళ్లు ఎవరూ లేరు.. అరెస్ట్ చేస్కో రేవంత్‌రెడ్డి' అని సవాల్ విసిరారు. "ఓటేసిన పాపానికి వారి భూములను కాజేయాలనుకోవడం కుట్ర కాదా?

అల్లుడు, అన్న కోసం.. రైతన్న నోట్లో మట్టికొట్టడం కుట్ర కాదా? 9 నెలలుగా రైతుల జీవితాలను రోడ్డున పడేయడం కుట్ర కాదా? మర్లపడ రైతులు ఎదురు తిరిగినందుకు చిత్రహింసలు పెట్టారు." అని కేటీఆర్ ఆరోపించారు.

# హేమంత్ సోరెన్ అండ్ కంపెనీకి ఆ రోజే వీడ్కోలు: అమిత్ షా



డుమ్రీ: ఝూరండ్ అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్ సోరెన్ సర్కారుకు ఓటమి తప్పదని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన (నవంబర్ 23) రోజే సీఎం హేమంత్ సోరెన్ అండ్ కంపెనీకి వీడ్కోలు అన్నారు. ఝూర?ండ్‌లో మలి విడత ఎన్నికల ప్రచారం సందర్భంగా డుమ్రీలో ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా ప్రసంగించారు. అధికార దురాశ వల్లే ఝూర?ండ్ ఏర్పాటును వ్యతిరేకించిన ఆర్జేడీ -కాంగ్రెస్ ఒడిలో హేమంత్ సోరెన్ కూర్చోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న అమిత్ షా.. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారన్నారు. ఝూర?ండ్‌లో చొరబాట్లను హేమంత్ సర్కార్ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే చొరబాటుదారులను బహిష్కరిస్తామన్నారు. అనేక పరిశ్రమలు నెలకొల్పి.. ఒక్క యువకుడు కూడా వలస వెళ్లకుండా చూస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హేమంత్ సోరెన్ గతంలో నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని సైతం నెరవేర్చలేదన్నారు. భాజపా అధికారంలోకి వస్తే.. యువతకు నెలకు రూ.2వేలు నిరుద్యోగ భృతి కల్పించడంతో పాటు 2లక్షలకు పైగా ఖాళీ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.



# నడిరోడ్డుపై తల్లీకుమారుడి హత్య

## సంగారెడ్డి జిల్లాలో దారుణం.. నడిరోడ్డుపై తల్లీకుమారుడి హత్య

గుమ్మడిదల: సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. తల్లీకుమారుడిని నడిరోడ్డుపై నాగరాజు అనే వ్యక్తి కత్తితో పొడిచి హతమార్చాడు. గుమ్మడిదల మండలం బొంతపల్లిలో ఈ ఘటన జరిగింది.

మృతులను సరోజాదేవి (50), అనిల్ (30)గా గుర్తించారు. ఆరు నెలల క్రితం తన రెండున్నరేళ్ల కుమారుడి మృతికి కారణమని భావిస్తూ కక్ష పెంచుకుని ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

# బీఆర్ఎస్ నేతలు అలా చేస్తే తీవ్ర పరిణామాలు.. మంత్రి పొంగులేటి మాస్ వార్నింగ్




హైదరాబాద్: రైతులను నష్టపెట్టాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వారి సమస్యలను వినడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని తెలిపారు. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. లగచర్ల సంఘటను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని అన్నారు. ఈ రోజు అధికారులపై దాడి జరిగినట్లుగానే ..రేపు రాజకీయ నాయకులు, ప్రజలపై దాడి జరిగితే ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఇవాళ(గురువారం) గాంధీభవన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... వికారాబాద్ జిల్లాకు ఫస్ట్ మేజిస్ట్రేట్‌గా ఉన్న కలెక్టర్‌పైనే హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. అధికారుల మీద దాడి జరగడం మనమీద మనం దాడి చేసుకునట్లేనని అన్నారు. రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు చేశారు. కుట్రపూరితంగా అధికారులను రైతులకు దూరం చేసే ప్రయత్నం కొంతమంది చేస్తున్నారని మండిపడ్డారు. గులాబీ గూండాల కుట్రలను రైతాంగం అర్థం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలను కాపాడుకున్నట్లే, అధికారులను కాపాడుకోలేకపోతే పని చేయడానికి ఏ అధికారి ముందుకు వస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఇదే పద్ధతి పాటించారా అని నిలదీశారు. ఏం తప్పుచేశారని ఆనాడు ఖమ్మంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైల్లో పెట్టారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లో రైతులను దేశద్రోహులుగా చిత్రీకరించారని ఆరోపించారు. పిల్లా, పాపా, ముసలి అనే తేడా లేకుండా రాత్రికి రాత్రి వారిని అరెస్ట్ చేసి సంకెళ్లు వేసిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో దళితులకు బేడీలు వేసిన సంగతి మరిచిపోయారా అని నిలదీశారు. లగచర్లలో ఆ పరిస్థితి లేదు కదా అని మంత్ర పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. నాంపల్లి కోర్టులో సరెండర్ అయిన భుజంగరావు


హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు గురువారం నాంపల్లి కోర్టులో లొంగిపోయారు.

మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని కోరుతూ భుజంగరావు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం న్యాయస్థానం కొట్టివేసింది. గురువారం సాయంత్రం 4 గంటల్లోపు కోర్టులో హాజరు కావాలని ఆదేశించింది. గతంలో అనారోగ్య కారణాలతో భుజంగరావు మధ్యంతర బెయిల్ పొందారు. గురువారం దీని గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ఆయన నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు.




# ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నా 'స్థానిక' ఎన్నికల్లో పోటీకి ఇక అర్హులే..

అమరావతి: ఇద్దరి కంటే ఎక్కువ సంతానం గల వ్యక్తులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులన్న నిబంధనను ఎత్తివేస్తూ ఇందుకు సంబంధించిన చట్ట సవరణ బిల్లులను శాసనసభ బుధవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు పోటీకి అనర్హులని చట్టం చేశారు. కాలక్రమంలో సంతానోత్పత్తి రేటు తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో మొత్తం సంతానోత్పత్తి సామర్థ్యం రేటు (టీఎఫ్ఆర్) 2001లో 2.6% నుంచి ఇటీవల కాలంలో 1.5%కి తగ్గింది. ఈ నేపథ్యంలో సంతానోత్పత్తిపై నియంత్రణను ఎత్తి వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా స్థానిక సంస్థల్లో పోటీకి ఇద్దరి కంటే ఎక్కువ సంతానంగల వారు అనర్హులన్న పురపాలక, పంచాయతీరాజ్ చట్టానికి సవరణలను ప్రతిపాదిస్తూ ప్రవేశపెట్టిన బిల్లులను శాసనసభ ఆమోదించింది.



# పోలీసులు చెప్పేవి నిజం కాదు.. హైకోర్టులో నరేందర్‌రెడ్డి క్వాష్ పిటిషన్

హైదరాబాద్: తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ లగచర్ల ఘటనలో ఏ1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ప్రభుత్వాధికారులపై దాడి కేసులో చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నరేందర్ రెడ్డిని గురువారం న్యాయవాదులు కలిశారు. వారి ద్వారా కోర్టుకు నరేందరెడ్డి అఫిడవిట్ పంపించారు. "బుధవారం ఉదయం కేబీఆర్ పార్క్ వద్ద మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో నన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా కారులో ఎక్కించి వికారాబాద్ డీటీసీకి తీసుకెళ్లారు. ఆ సమయంలో పోలీసులు నా స్టేట్‌మెంట్ తీసుకోదు. కోర్టులో హాజరుపరిచే 10 నిమిషాల ముందు కొన్ని పేపర్లపై నా సంతకాలు తీసుకున్నారు. నన్ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారు. అరెస్టుకి ముందు నాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. కేటీఆర్ సహా ఇతర ముఖ్యనేతల అదేశాలతో దాడులు చేయించినట్లు పోలీసలు కట్టుకథ చెప్పారు. నేను పోలీసులకు ఎలాంటి వాగ్మూలం ఇవ్వలేదు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు చెప్పినవన్నీ నిజం కాదు. నా స్టేట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకొని విచారణ చేయాలి" అని కోర్టుకు పంపించిన అఫిడవిట్‌లో నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మరో వైపు నరేందర్‌రెడ్డిని 7 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు వికారాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరగనుంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com